www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 288 | మంగళవారం | 15 ఏప్రిల్, 2025

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681



## కంచ గచ్చిబౌలి భూ వివాదం

- సుప్రీంలో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు

03



04

## సన్నబియ్యంతో ఊరంతా పండగ

- వచ్చిన బియ్యంతో వండి వార్చిన ఇల్లాలు
- అందరికీ భోజనం పెట్టిన లక్ష్మీ
- సిద్దిపేట జిల్లా ఘటనపై సీఎం ఆనందం
- ఇల్లాలు లక్ష్మిని అభినందిస్తూ ట్వీట్



## పార్క్ హయత్‌లో అగ్ని ప్రమాదం

- క్రికెటర్లకు తప్పిన ముప్పు

04

నగరంలోని పార్క్ హయత్‌లో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. అయితే ఈ హెూటల్‌లోనే హైదరాబాద్ సన్‌రైజర్స్ టీం బస చేస్తోంది. దీంతో ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఫ్యాన్స్ ఒకింత ఆందోళన చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే సన్‌రైజర్స్ బృందాన్న అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది.




# ధరణి ఓ పీడకల

## అందుకే భూ భారతి

### ప్రయోగాత్మకంగా 3 మండలాల్లో అమలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'భూభారతి' పోర్టల్‌ను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరియు పలువురు మంత్రులు కూడా పాల్గొన్నారు. ఈ పోర్టల్‌ను మొదటగా ప్రయోగాత్మకంగా 4 మండలాల్లో అమలు చేయనున్నారు. అవి: మద్దూరు (నారాయణపేట జిల్లా), లింగంపేట (కామారెడ్డి), వెంకటాపూర్ (ములుగు), నేలకొండపల్లి (ఖమ్మం) మండలాలను ఎంపిక చేశారు. ఈ పోర్టల్‌ను జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ప్రజల నుంచి అవసరమైన సూచనలను స్వీకరించి, పోర్టల్‌లో తగిన మార్పులు చేసే ప్రక్రియను రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రారంభించారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా పోర్టల్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు.

- జూన్ 2 నాటికి పూర్తిస్థాయిలో..
- సాంకేతిక సమస్యలు రాకుండా అధ్యయనం
- కొత్త పోర్టల్ ప్రారంభించిన సీఎం రేవంత్



**ప్రజానావ, హైదరాబాద్:** ధరణికి చెల్లుచీటీ పలికిన ప్రభుత్వం భూభారతి తసుకొచ్చింది. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని శిల్పకళా వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భూభారతి' పోర్టల్ ప్రారంభమైంది. తొలుత ఈ కార్యక్రమాన్ని మూడు మండలాల్లో అమలు చేయనున్నారు. జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ప్రజల నుంచి అవసరమైన సూచనలు స్వీకరించి, తగిన మార్పులు చేయాలని ఇప్పటికే రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రజల నుంచి వచ్చే స్పందన మేరకు ఈ పోర్టల్‌ను ఎప్పటికప్పుడు ఆధునీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్,మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, మంత్రులు ఉత్తమ్,పొంగులేటి, పొన్నం, జూపల్లి,మేయర్

మిగతా 2 లో

## హామీ మేరకు భూభారతి తెచ్చాం

మంత్రి పొంగులేటి

02



## గోల్కొండ నీలం వజ్రం వేలం

- జెనీవా వేదికగా వచ్చేనెల 14న వేలం పాట

03



## గిగ్ వర్కర్లకు గుడ్ న్యూస్

- ఉద్యోగ భద్రత, బీమా, ఇతర హక్కులతో చట్టం
- న్యాయశాఖ ఆమోదానికి ప్రతిపాదనలు
- క్లియరెన్స్ రాగానే నోటిఫికేషన్

03



## కారు డోర్స్ లాక్

- ఊపిరాడక ఇద్దరు చిన్నారులు మృతి

02



## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత

- వర్గీకరణ అమలు చేస్తూ ఉత్తర్వులు
- ఎస్సీ ఏండ్ల పోరాటానికి..
- మంత్రులతో కలసి ఉత్తర్వులు ఇచ్చిన సీఎం రేవంత్

02

## పర్యావరణ ధ్వంసంలో కాంగ్రెస్ బిజీ



- మేము రక్షిస్తుంటే.. వారు ధ్వంసం చేస్తున్నారు
- కంచ గచ్చిబౌలి భూములపై ప్రధాని విమర్శలు
- అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది
- వక్ఫ్ చట్టాన్ని దుర్వినియోగం చేసిన కాంగ్రెస్
- హిస్సార్ విమానాశ్రయం ప్రారంభంలో ప్రధాని

**చండీఘడ్:** అడవులపై బుల్డోజర్లు నడిపించడంలో తెలంగాణ ప్రభుత్వం బిజీగా ఉందని ప్రధాని మోడీ ఘాటు విమర్శలు చేశారు. ప్రకృతిని ధ్వంసం చేస్తూ వన్యప్రాణులను చంపుతున్నారని ప్రధాని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ప్రధాని మోదీ మండిపడ్డారు. హర్యానా రాష్ట్రంలో హిసార్ ఎయిర్‌పోర్టుని ప్రధాని మోదీ ప్రారంభించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకున్నారు. హైదరాబాద్ కంచ

మిగతా 2 లో

## గచ్చిబౌలి భూముల్లో చెట్లను నరకలేదు

- జంతువులను కూడా చంపలేదు
- తెలంగాణపై ఎందుకిలా మాట్లాడారో ప్రధాని చెప్పాలి
- మోడీ వ్యాఖ్యలపై మండిపడ్డ భట్టి, శ్రీధర్ బాబు తదితరులు



03



# అంబేద్కర్‌కు ఘనంగా నివాళి

## పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన రేవంత్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ట్యాంక్ బండ్ వద్ద ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ,ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దళిత సంఘాలు, పలువురు నేతలు అంబేద్కర్‌కు నివాళి అర్పించారు.

# గోల్కొండ నీలం వజ్రం వేలం

**న్యూఢిల్లీ:** అలనాటి విలువైన అరుదైన గోల్కొండ నీలం వజ్రం ఇక వేలానికి రానుంది. గతంలో ఈ వజ్రానికి ఇండోర్, బరోడా మహారాజులు యజమానులుగా ఉండేవారు. వచ్చే నెల 14వ తేదీన జరిగే క్రిస్టి వజ్రాల వేలం పాటలో ,ఈ వజ్రం దాదాపుగా రూ 300 కోట్ల వరకూ పలుకుతుందని భావిస్తున్నారు. జెనీవాలో జరిగే ఈ వేలంలో ప్రముఖ వజ్రాల వ్యాపారులు పాల్గొంటారు. ఓ నాజూకైన ఉంగరంలో పొదిగి ఉండే ఈ వజ్రం ధర మొత్తం మీద రూ 430 కోట్ల వరకూ పలుకుతుందని విశ్లేషిస్తున్నారు. 23.24 క్యారెట్ల బరువుతో ఉండే ఈ వజ్ర ఖచిత ఉంగరాన్ని ప్రఖ్యాత జువెలర్ సంస్థ జార్ తయారు చేసింది. ఉనికి తగ్గట్లుగానే రాజరికపు కళ, అసాధారణ వైవిధ్యపు రంగు , అనితర సాధ్యపు పరిణామంతో ఈ వజ్రం ఉంటు-ంది. ప్రపంచంలోనే ఇది అత్యంత అరుదైన వజ్రరాజం అని క్రిస్టి ఇంటర్నేషనల్ సంస్థ అధినేత రాహుల్ కడాకియా తెలిపారు. వేలానికి అందరిని ఆహ్వానించారు.

# గిగ్ వర్కర్లకు గుడ్ న్యూస్

**ప్రజానావ, హైదరాబాద్:** గిగ్ అండ్‌ప్లాట్‌ఫామ్ వర్కర్స్' కు మేడే సందర్భంగా ప్రభుత్వం శుభవార్త అందించబోతోంది. వారి రక్షణకు చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు బిల్లు ముసాయిదా సిద్ధం చేయాలని కార్మిక శాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గిగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా బిల్లు రూపొందించాలన్నారు. గిగ్ వర్కర్ల భద్రతపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వారికి బీమా, ఇతర హక్కులు కల్పించేలా బిల్లు ఉండాలన్నారు. బిల్లు ముసాయిదాను ఆన్‌లైన్‌లో పెట్టాలని.. ప్రజల అభిప్రాయాన్ని సేకరించాలని సీఎం ఆదేశించారు. సూచనలను తీసుకొని, వాటిని పరిశీలించి తుది ముసాయిదాను రూపొందించాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. గిగ్‌వర్కర్ల చట్టంలో కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. కంపెనీలు, అగ్రిగేటర్లను సమన్వయం చేసేలా కొత్త చట్టం ఉండాలని చెప్పారు. ఈ నెల 25 నాటికి బిల్లు తుది ముసాయిదాను సిద్ధం చేయాలన్నారు. మే డే రోజున చట్టం అమల్లోకి తెచ్చేలా ఏర్పాట్లు చేయాలని కార్మిక శాఖ ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.

# కారులో చిన్నారుల ఆట



## డోర్ లాక్ పడడంతో ఊపిరాడక మృతి

**ప్రజానావ, చేవెళ్ల:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దామరగిద్దలో విషాదం చోటు చేసుకుంది. బంధువుల వివాహానికి వచ్చిన వారి చిన్నారుల మృతి కలకలం రేపింది. గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. ఆడుకుంటూ వెళ్లిన చిన్నారులు ..కారు డోర్లు లాక్ పడటంతో అందులో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు ఊపిరాడక మృతి చెందారు. బంధువుల వివాహానికి వచ్చిన అక్కచెల్లెళ్ల పిల్లలు తన్మయశ్రీ (5), అభినయశ్రీ (4).. ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న కారులోకి వెళ్లారు. అయితే, కారు డోర్లు లాక్ పడటం, అది ఇతరులెవరూ గమనించకపోవడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. చిన్నారులు ఎంతసేపటికీ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వారి కోసం వెతికారు. చివరకు కారులో అపస్మారక స్థితిలో ఉన్న పిల్లలను గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు డోర్లు ఎలా లాక్ అయ్యాయి?ఇతర కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ధరణి ఓ పీడకల



మొదటి పేజీ తరువాయి

గద్వాల విజయలక్ష్మీ పలువురు నేతలు, రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. పలువురు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ మాట్లాతుతూ.. ధరణి రాష్ట్ర రైతులకు ఒక పీడ కల లాంటిదని అభివర్ణించారు. ధరణి పోర్టల్‌తోనే తహసీల్దార్‌పై పెట్రోల్ పోసి హత్య చేసే పరిస్థితి తలెత్తిందన్నారు. గత 65 ఏండ్లుగా భూములకు సంబంధించిన వివరాలను రెవిన్యూ సిబ్బందే కాపాడారు.. కానీ గత బీఆర్ఎస్ పాలకులకు ధరణి వచ్చాకే రెవిన్యూ సిబ్బంది దొంగలుగా కనిపించారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ సిబ్బందిని దొంగలుగా చూపి వేలాది ఎకరాలను కొల్లగొట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన భూచట్టాలను ఉన్నఫళంగా తొలగించి.. ధరణి పోర్టల్ తీసుకొచ్చారని.. ధరణితో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. ధరణి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి అన్ని వివరాలను పొందుపరిచిందని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున భూభారతి చట్టాన్ని 69 లక్షల కుటుంబాలకు అంకితం చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో 100 ఏళ్లు భూముల కోసమే పోరాటం జరిగిందని.. నిజాంకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య పోరాటం చేశారని గుర్తు చేశారు. పాదయాత్ర సమయంలో రాష్ట్రంలోని భూసమస్యలు తెలుసుకున్నానని.. అప్పుడే ధరణి స్థానంలో కొత్త వ్యవస్థ తీసుకురావాలని నిర్ణయించుకున్నామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం వచ్చాక ధరణిని బంగళాఖాతంలో వేస్తామని అనాడే చెప్పాం.. చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను తీసేసి దాని స్థానంలో భూభారతి తీసుకొచ్చామన్నారు. వివిధ రాష్ట్రాల్లో భూచట్టాలను పరిశీలించాకే భూభారతి చట్టం రూపొందించామని తెలిపారు. అన్ని వర్గాల నుంచి సలహాలు తీసుకున్నాకే దీనిని ప్రారంభించామన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా 4 మండలాలను తీసుకున్నామన్నారు. ప్రతీ గ్రామంలో రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించామన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే రెవెన్యూ సిబ్బంది ముఖ్యం. రెవెన్యూ సిబ్బందిని మా ప్రభుత్వం 100 శాతం నమ్ముతుందని పేర్కొన్నారు. తాము చేసే తప్పులకు రెవెన్యూ సిబ్బందిని బలి చేసే సంస్కృతికి మేం వ్యతిరేకమని స్పష్టం చేశారు. గత సీఎం కేసీఆర్ రెవెన్యూ శాఖను ఎలా దూషించారో చూశాం. ఎలుక దూరిందని ఇల్లు తగలబెట్టే వ్యవహారం చేశారు. కానీ రెవెన్యూ సిబ్బంది ఆత్మగౌరవమే మా ఆత్మగౌరవమని అన్నారు. 69 లక్షల మందికి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ శాఖ రెండు కళ్లలాంటివన్నారు. మనుషులకు ఆధార్ మాదిరిగా భూములకు భూదార్ అని అన్నారు. భూమి హద్దులు నిర్ణయించేంది రెవెన్యూ సిబ్బందేనని.. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా రెవెన్యూ సిబ్బంది చూసుకోవాలని సూచించారు. రైతులు పిలిచి భోజనం పెట్టి మాట్లాడేలా రెవెన్యూ సిబ్బంది తీరు ఉండాలని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ప్రతి మండలంలో పర్యటించాల్సిదేనన్నారు. ఇకపోతే ప్రయోగాత్మకంగా 3 మండలాల్లో ఈ పోర్టల్‌ను అమలు చేయనున్నారు. జూన్ 2 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రజల నుంచి అవసరమైన సూచనలు స్వీకరించి, తగు మార్పులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే స్పందన మేరకు ఎప్పటికప్పుడు పోర్టల్‌ను అప్‌డేట్ చేయనున్నారు. 566 రైతువేదికలలో భూ భారతి పోర్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేశారు. భూ భారతి అమలుకు పైలట్ ప్రాజెక్ట్ గా నల్గొండ జిల్లాలోని తిరుమలగిరి సాగర్, రంగారెడ్డి జిల్లాలోని కీసర, సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇన్నాళ్లు ధరణి పోర్టల్‌లో జరిగిన వ్యవసాయ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు.. ఇకపై భూభారతి పోర్టల్‌లోనే జరగనున్నాయి. గతంలో ధరణి తీసుకొచ్చిన సమయంలో భూముల లావాదేవీలకు కొన్నిరోజుల పాటు ఆటంకం ఏర్పడగా, ఈసారి అలాంటి ఇబ్బందులేవీ లేకుండా ప్లాన్ చేశారు. ధరణిలో ఎలాంటి సేవలు అందాయో, ఇప్పుడు అవన్నీ భూభారతిలోనూ యథావిధిగా అందనున్నాయి. భూములకు సంబంధించి తాజా సమాచారం అలాగే ఉండనుంది. ఎలాంటి మార్పులు ఉండవు. అయితే రైతులకు అర్థమయ్యేలా ఇంతకుముందు ఉన్న 33 మాడ్యుల్స్‌ను ఆరుకు కుదించారు. యూజర్ ఫ్రెండ్లీగా వెబ్ పోర్టల్‌ను తీసుకురావడమే కాకుండా ఇతర టెక్నికల్ సమస్యలను తొలగించారు. భూభారతి చట్టాన్ని పోయినేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం తీసుకొచ్చింది. దీన్ని అమలు చేసేందుకు అవసరమైన గైడ్‌లైన్స్ రెడీ చేసి, ఏప్రిల్ 14 నుంచి దశలవారీగా అమలు÷-లోకి తీసుకుని వచ్చింది. చట్టంలోని అన్ని అంశాలను ఒకేసారి అమలు చేస్తే మళ్లీ సమస్యలు వచ్చే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం.. ఒక్కొక్కటిగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ చట్టంలో మొత్తం 23 అంశాలు ఉన్నాయి. ప్రతి సెక్షన్ అత్యంత కీలకంగా ఉంది. ప్రతిదీ వెబ్ పోర్టల్‌కు లింక్ చేయాల్సి ఉంటుంది. దీంతో ముందుగా సులువుగా ఉన్న వాటన్నింటినీ అమలు చేయనున్నారు. ఆ తర్వాత టెక్నాలజీని జోడించి, ఒక్కోదాన్ని అమలు చేసుకుంటూ వెళ్లనున్నారు. ఇప్పుడైతే రాష్ట్రవ్యాప్తంగా పోర్టల్ అందుబాటు-లోకి వస్తుంది. ఇకపై అందులోనే భూముల కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతాయి.. అయితే భూభారతి చట్టం అమలు, పోర్టల్ నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు వస్తున్నాయా? అనేది తెలుసుకునేందుకు మూడు మండలాల్లో అధ్యయనం చేయనున్నారు. ఇందుకోసం నల్గొండ జిల్లాలోని తిరుమలగిరి సాగర్ రంగారెడ్డి జిల్లాలోని కీసర, సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మండలాల్లో వంద శాతం భూసమస్యలను పరిష్కరించే విధంగా ముందుకెళ్తున్నది. ఇంతకుముందు ధరణిలా కాకుండా రైతులు తమ భూమి వివరాలను తేలిగ్గా తెలుసుకునేలా భూభారతి పోర్టల్ రూపొందించారు.

# హామీ మేరకు భూభారతి పోర్టల్ తెచ్చాం

## దొరలు, భూస్వాములకు అనుకూలంగా ధరణి
## అందుకే దానిని బంగాళాఖాతంలో విసరేసాం
## మంత్రి పొంగులేటి వెల్లడి

**ప్రజానావ, హైదరాబాద్:** గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రైతులకు ప్రయోజనకరంగా లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దొరలకు, భూస్వాములకు అనుకూలంగా ధరణి పోర్టల్‌ను రూపొందించారని విమర్శించారు. 'భూ భారతి' పోర్టల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతులకు కంటి మీద నిద్రలేకుండా చేసే చట్టం చేసిందని ఆరోపించారు. ధరణి ఆరాచకాల ఫలితం అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించింది. ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రజలకు ఉపయోగపడే పోర్టల్ తెచ్చాం. ప్రజలు ఆమోదించని చట్టం కాబట్టే.. ధరణిని పక్కన పడేశాం. కలెక్టర్ దగ్గర ఉన్న అధికారాలను వికేంద్రీకరణ చేశాం. వివిధ రాష్ట్రాల్లోని భూచట్టాలన్నింటినీ అధ్యయనం చేసి.. ఉత్తమ చట్టం రూపొందించాం. హరీశ్‌రావు వంటి నేతల సూచనలు కూడా స్వీకరించాం. ముసాయిదాను మేధావులు, రైతుల ముందు పెట్టామని పొంగులేటి తెలిపారు. దొరల కోసం నాడు కేసీఆర్ ధరణి తెచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ధరణితో సామాన్యులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని చెప్పారు. ఆనాటి దొరలు తెచ్చిన చట్టం వారి స్వార్థం కోసం తెచ్చారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక ధరణిని బంగాళాఖాతంలో వేస్తామన్నం.. వేశామన్నారు. ధరణితో కంటిమీద కుణుకులేకుండా చేశారన్నారు. కేసీఆర్ పేరుకు ధరణి చట్టం తెచ్చారు కానీ రూల్స్ లేవన్నారు. దొరకు తెల్లవారుజామున ఏ ఆలోచన వస్తే అదే రూల్ అని సెటైర్ వేశారు. వివీఆర్వో, వీఆర్ ఏలు చెప్పినట్టు-వినలేదని కేసీఆర్ అందరినీ తొలగించారు. భూభారతి చట్టంతో అధికారులు అహర్నిశలు కష్టపడ్డారు. కలెక్టర్ల దగ్గరున్న కొన్ని పవర్స్ ను కింది అధికారులకు ఇచ్చాం. పలు రాష్ట్రాల్లో ఉన్న భూచట్టాలను అధ్యయనం చేసి..చట్టాన్ని రూపొందించాం. 2020 చట్టం చేయకుముందు రైతులు సంతోషంగా ఉన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న రైతుల కోసం కష్టపడ్డాం. నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ గా అమలు చేస్తున్నాం. ఏప్రిల్ 17 నుంచి రెవెన్యూ అధికారులే మీ గ్రామాలకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారు. మే మొదటి వారంలో ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్ గా చేస్తాం. జూన్ 2 తర్వాత ప్రతి మండలానికి రెవెన్యూ అధికారులు మీ గ్రామాలకే వస్తారు. భూములున్న ఆసాములు,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ చట్టం రూపొందించే అవకాశం వచ్చినందుకు నా జన్మ ధన్యమైంది. అని పొంగులేటి అన్నారు.



# భూ భారతిపై అవగాహన పెంచుకోండి

## చట్టం అమలు బాధ్యత కలెక్టర్లదే
## కలెక్టర్లతో సమావేశంలో సీఎం రేవంత్ స్పష్టం

**ప్రజానావ, హైదరాబాద్:** భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు, తాగు నీటి సరఫరా అంశాల్లో నిర్లక్ష్యం సహించబోమని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఎక్కడా లోపాలు జరగకుండా చర్యలు తీసుకోండి.. భూ భారతి చట్టంపై కలెక్టర్లకు పూర్తి అవగాహన ఉండాలని అన్నారు.. జిల్లాలోని ప్రతీ మండలంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులకు కలెక్టర్లు హాజరు కావాల్సిందే.. చట్టంపై ప్రజలకు సరళంగా వివరించాలి.. ప్రతీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలి..ప్రతీ నియోజకవర్గానికి ఒక స్పెషల్ ఆఫీసర్ ను నియమించాలి.. జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదం తరువాతే తుది లబ్ధిదారుల జాబితా ప్రకటించాలని సూచించారు. తాగునీటి సరఫరా విషయంలో జిల్లాల్లో వేసవి యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలి.. నీటి లభ్యత ఆధారంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించండి.. ఎక్కడా తాగు నీటి సమస్య రాకూడదు.. ఎప్పటికప్పుడు నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకుంటూ తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండని అధికారులను ఆదేశించారు.

## ప్రజావాణి సమస్యలు సత్వర పరిష్కారం

ప్రజావాణి పై సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 117 సార్లు ప్రజావాణి నిర్వహించామని అధికారులు తెలిపారు. ప్రజావాణిలో 54,619 అర్జీలు ప్రజలు నమోదు చేసుకున్నారు. వీటిలో 68.4శాతం (37384) అర్జీలు పరిష్కారమయ్యాయి. ప్రజావాణి అర్జీలను పరిష్కరించేందుకు మరింత పారదర్శకమైన విధానాలు అమలు చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ప్రజావాణి డ్యాష్ బోర్డు యాక్సెస్ ను తనకు అందించాలని సీఎం కోరారు. లైవ్ యాక్సెస్ ఉండేలా ఏర్పాటు-చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీల వివరాలతో పాటు-.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల సమాచారాన్ని ఆన్ లైన్ లో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం జరుగుతున్న ఉద్యమానికి ఇది ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుందని ప్రభుత్వం పేర్కొంది.. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం, మొత్తం 56 ఎస్సీ కులాలను మూడు విభాగాలుగా వర్గీకరించింది. మూడు గ్రూపులుగా విభజన, రిజర్వేషన్ల కేటాయింపు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రూప్-ఆ లో అత్యంత వెనుకబడిన కులాలకు 1 శాతం రిజర్వేషన్, గ్రూప్-ఇ లో మధ్యస్థ లబ్దిదారులకు 9 శాతం రిజర్వేషన్, గ్రూప్- ఈలో మెరుగైన స్థితిలో ఉన్న కులాలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ విధంగా మొత్తం 15 శాతం రిజర్వేషన్లను వర్గీకరించిన రూపంలోనే కొనసాగించనున్నారు. ఈ వర్గీకరణ సామాజిక న్యాయానికి, సమతా స్థాపనకు దోహదపడుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం సాగిన పోరాటానికి నేడు చట్టబద్ధత లభించింది. ఇది బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగడంలో ముఖ్యమైన అడుగని అన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో పేదలకు మెరుగైన అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే, ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత పథకాలపై ఆయన వివరించారు. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రైతులు, రైతు కూలీలకు ఎకరాకు రూ.12 వేలు ఆర్థిక భరోసాగా అందిస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవ ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించామని, భూమిపై హక్కుల కోసం భూభారతి పథకానికి శ్రీకారం చుట్టామని వివరించారు. ఈ నిర్ణయాలు తెలంగాణలోని ఎస్సీ వర్గాలకు సామాజిక, ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రగతిపథంలో ముందడుగు వేయడం అని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# గచ్చిబౌలి భూముల్లో చెట్లను నరకలేదు

- జంతువులను కూడా చంపలేదు
- తెలంగాణపై ఎందుకిలా మాట్లాడారో ప్రధాని చెప్పాలి
- మోడీ వ్యాఖ్యలపై మండిపడ్డ భట్టి, శ్రీధర్ బాబు తదితరులు





**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతిని ధ్వంసం చేసి వన్యప్రాణులను చంపుతోందని కంచ గచ్చిబౌలి భూములను ఉద్దేశించి ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తిప్ఇపకొట్టింది. ప్రధాని మోడీ వ్యాఖ్యలకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటుగా స్పందించారు. తెలంగాణ గురించి ప్రధాని మోడీ ఎందుకు అలా మాట్లాడారో మాకు తెలియదు. కానీ కంచ గచ్చిబౌలి భూముల్లో మేం చెట్లను నరకలేదు.. జంతువులను చంపలేదని స్పష్టం చేశారు. అడవులను పెంచి ప్రకృతిని కాపాడటమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉందని.. వాస్తవాలను కోర్టుకు తెలియజేస్తామని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిలో అటవీ భూమి లేదని.. ఆ భూముల్లో వివిధ సంస్థలు ఉన్నాయన్నారు. మంత్రి శ్రీధర్ బాబు కూడా ప్రధాని మోడీ వ్యాఖ్యలపై స్పందించారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని.. కోర్టు పరిధిలో ఉన్న ఇష్యూపై ప్రధాని మోడీ ఎందుకు మాట్లాడారని నిలదీశారు. కంచ గచ్చిబౌలిలో అసలు అటవీ భూమి లేదన్నారు. కంచ గచ్చిబౌలి భూములపై బీజేపీ నేతలు తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని.. వాస్తవాలను మేం కోర్టు ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలను బద్నాం చేయకండని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతిని ధ్వంసం చేసి వన్యప్రాణులను చంపుతోందని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని ఉద్దేశించి ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ మహేష్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. హెచ్‌సియూలో ప్రధాని మోడీ ప్రారంభించిన 5 బిల్డింగులకు అనుమతులు లేవని.. మున్సిపల్, అటవీ, పర్యావరణ పర్మిషన్లు లేకుండానే లేకుండా భవనాలు నిర్మించారని అన్నారు. అలాగే.. మోడీ ఎన్నికల ర్యాలీల కోసం బీజేపీ లక్షల చెట్లను నరికేసిందని ఆరోపించారు. ఐదేండ్లలో 1.09 లక్షల చెట్లు తొలగించామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వమే చెప్పిందని గుర్తు చేశారు. అంబానీ, అదానీల కోసం బీజేపీ వేల చెట్లను నరికేందన్నారు. చెట్లను నరకడం బీజేపీ సంస్కృతి అని.. చెట్లను నాటడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానమన్నారు. ప్రధాని మోడీ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని.. ఆయన గతం మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. అంతకుముందు హర్యానాలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. అడవులపై బుల్డోజర్లను నడిపించడంలో తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ బిజీగా ఉందంటూ కంచ గచ్చిబౌలి భూములను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాము పర్యావరణాన్ని కాపాడుతుంటే వాళ్లు నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రకృతిని ధ్వంసం చేసి వన్యప్రాణులను చంపుతున్నారని ఆరోపించారు. గ్యారంటీ-ల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక ప్రకృతిని ధ్వంసం చేస్తూ వన్యప్రాణులను చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ

**సూర్యాపేట సన్నాహక సభలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి**

**ప్రజానావ, సూర్యాపేట:** చరిత్రలో నిలిచిపోయేలా బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. రజతోత్సవ సన్నాహక సభను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు జగదీశ్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న సభకు తరలివెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నాయని అన్నారు. కేసీఆర్ స్పీచ్ కోసం ప్రజలంతా ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే వైఫల్యం చెందిందని జగదీశ్ రెడ్డి అన్నారు. నెరవేర్చలేని హామీలతో కాంగ్రెస్ అభాసుపాలైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీపై అన్ని రంగాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని తెలిపారు. రైతుబంధు లేదు.. రైతు భరోసా లేదు.. రైతు బీమా లేదు.. రుణమాఫీ పూర్తి కాలేదని.. ఆసరా ఫించన్లు పెంచలేదని.. ఉన్న పింఛన్లు సమయానికి ఇస్తలేరని విమర్శించారు. ఎన్నికల ముందు అడ్డగోలుగా హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులు ఎత్తేసే దుస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలకు మోసపోయి ప్రజలు గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు లేక ఎండిన పంటలు.. చేతికొచ్చిన ఎంతో కొంత పంటకు మద్దతు ధర లేక అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, ఉద్యోగం, వ్యాపారం, రైతాంగం ఇలా అన్ని రంగాలలో ఎవరి నోట విన్న నేడు కేసీఆర్ మాటే వినిపిస్తుందని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల అభివృద్ధితో మన రాష్ట్రాన్ని యావత్ దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుకున్నామని తెలిపారు. అటు-వంటి గొప్ప నాయకత్వాన్ని కాంగ్రెస్ మాయమాటలకు మోసపోయి దూరం చేసుకున్నామని అన్ని రంగాల ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఎప్పటి-కై-నా తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని అంతా నమ్ముతున్నారని తెలిపారు. అందుకే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ మాటల కోసం ప్రజలంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 27న వరంగల్ లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సకాలంలో చేరుకునేలా అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



## ట్యాంక్ బండ్ వరకు బీజేపీ బైక్ ర్యాలీ

**అంబేడ్కర్‌కు నివాళి అర్పించిన నేతలు**

**ప్రజానావ, హైదరాబాద్:** అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు బీజేపీ బైకు ర్యాలీ నిర్వహించింది. బైకు ర్యాలీలో బిజెపి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, లక్ష్మణ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాళు లర్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ పేరిట రాజ్యాంగాన్ని కాంగ్రెస్ హత్య చేసిందని ఆరోపణలు చేశారు. రాజ్యాంగాన్ని తూట్లు- పొడిచేలా రాహుల్ గాంధీ వ్యవహరించారని మండిపడ్డారు. ఒడిదుడుకులు ఎదుర్కొన్నా రాజ్యంగం నిలబడిందంటే అంబేద్కర్ గొప్పదనమేనని కిషన్ రెడ్డి కొనియాడారు. అంబేద్కర్ నెట్ వర్క్ పేరుతో 5 ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దామని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచేలా చేసిన ఘనత ప్రధాని మోదీదే అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## నేడు సీఎల్పీ భేటీ

**ప్రధాన అంశాలపై దిశానిర్దేశం చేయనున్న రేవంత్**



**ప్రజానావ, హైదరాబాద్:** ఈ నెల 15న మంగళవారం కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించనున్నారు. శంషాబాద్‌లోని నోవాటెల్‌లో ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ సీఎల్పీ సమావేశం జరగనుంది. ఇందులో నాలుగు అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. భూ భారతి, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ-ఎస్టీ వర్గీకరణపై చర్చ ఉండనుంది. ఈమేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రభుత్వ విప్‌లు సమాచారమిచ్చారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక ప్రాధాన్యం సంతరించుకున్న సందర్భంలో కాంగ్రెస్ శాసనసభ పక్షం కీలక సమావేశం జరపడం కీలకంగా మారింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ శాసనపక్ష నాయకుడు రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు కీలక ప్రజాహిత పథకాలపై సమీక్ష జరుగనుంది. ఈ సీఎల్పీ సమావేశంలో భూభారతి పథకం, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు పథకం, ఎస్సీ అండ్ ఎస్టీ వర్గీకరణ క్యాటగరైజేషన్ పై చర్చించనున్నారు. ఈ విషయాలే కాక , రాష్ట్రంలో నెలకొన్న ఇతర ప్రాధాన్యమైన అంశాలపై కూడా ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు అభిప్రాయాలు పంచుకోనున్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశర చేయనున్న ఈ సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో విశేష ప్రాధాన్యం కలిగినదిగా భావిస్తున్నారు.

## కంచ గచ్చిబౌలి భూముల వివాదం

**సుప్రీంలో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు**

**న్యూఢిల్లీ:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కంచ గచ్చిబౌలి భూములు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కాక రేపుతున్న వేళ ఈ భూములపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సోమవారం అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రధాని మోడీ కూడా తాజాగా విమర్శలుచేశారు. ఈ భూములపై ఏప్రిల్ 16వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వ భూములేనని ఆ అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం క్లియర్ కట్‌గా స్పష్టం చేసింది. ఈ భూముల్లోనే సెంట్రల్ యూనివర్శిటీ-, మరికొన్ని ఇనిస్టిట్యూట్‌లు, బస్ స్టాండులు తదితర సౌకర్యాలు ఎన్నో వచ్చాయని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం సోదాహరణగా వివరించింది. సుమారు 20 ఏళ్లకుపైగా 400 ఎకరాల స్థలం న్యాయ వివాదంలో ఉన్నందున అక్కడ చెట్లు- మొలిచి.. అటవీ ప్రాంతంగా మారిందని ఈ అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం వివాదాస్పదం కావడంతో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమార్ గత రెండు రోజులుగా ఢిల్లీలోనే ఉండి. సీనియర్ న్యాయవాదలతో చర్చించి.. ఈ అఫిడవిట్‌ను సిద్ధం చేశారు. సోమవారం దీనిని సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత జరిగింది. మరోవైపు ఉచిత పథకాల కారణంగా ప్రభుత్వ ఖజానాలో నిధులు నిండుకొన్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కంచ గచ్చిబౌలిలోని దాదాపు 400 ఎకరాలు వేలం పాట నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ స్థలంలో జేసీబీల సాయంతో చెట్లను సైతం నరికి వేయించింది. ఈ విషయం తెలిసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- విద్యార్థులు ఆందోళనలు, ధర్నాలకు దిగారు. వీరి ఆందోళన తీవ్ర తరం చేయడంతో.. ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ సైతం వారికి మద్దతు ప్రకటించాయి. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- విద్యార్థులతో పాటు- ప్రతిపక్షాలు ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు స్పందించింది. కంచ గచ్చిబౌలిలో చెట్లు- నరకవద్దంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే ఈ వ్యవహారంలో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇంకోవైపు ఈ భూములపై రేవంత్ రెడ్డి సర్కార్ ఓ లేఖ విడుదల చేసింది. 2003లో ఈ భూములను నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వం ఐఎంజీ సంస్థకు విక్రయించిందని తెలిపింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసిందని స్పష్టం చేసింది. అంతేకాకుండా.. ఈ భూములు ప్రభుత్వానికి కేటాయించడంతో.. అందుకు ప్రతిగా ప్రభుత్వం మరో చోట వందలాది ఎకరాలను సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించిందని ఆ లేఖలో ప్రభుత్వం సోదాహరణగా వివరించిన సంగతి తెలిసిందే.

## పటిష్ట రాజ్యాంగానికి పునాది వేసిన అంబేడ్కర్

**ఆయన ఆలోచనా విధానాలే దేశానికి శ్రీరామరక్ష**
**అంబేడ్కర్ చూపిన మార్గంలోనే తెలంగాణ సాకారం**
**దళితులకు అభయహస్తం ఎప్పుడిస్తారో చెప్పాలి**
**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్**



**ప్రజానావ, హైదరాబాద్:** కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆధునిక భారతావనికి పునాదులు వేశారని తెలిపారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదని వెల్లడించారు. ఆయన వల్లనే తెలంగాణ కల సాకారమయ్యిందని అన్నారు. దేశంలో అందరూ బాగుండాలన్నదే అంబేద్కర్ ఆలోచన అని చెప్పారు. అంబేద్కర్ ఆలోచనను కేసీఆర్ ఆచరణలో పెట్టారన్నారు. దళితబంధు లాంటి పథకాన్ని అమలు చేసిన దమ్మున్న నాయకుడు కేసీఆర్ అన్నారు. అబద్ధపు ప్రచారంతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, దళితులకు అంబేద్కర్ అభయహస్తం ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. రూ.12 లక్షల కాదుకదా.. 12 రూపాయలు కూడా ఇవ్వరని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీ-ఆర్.. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్త రాష్ట్రాల ఏర్పాటు-కు అంబేద్కర్ ఆలోచనలే కారణమన్నారు. ప్రజాస్వామ్యంలో మందబలంతో అవతలివారి గొంతు నొక్కేయడం ఉండకూడదని అందరితో కొట్లాడి కొత్త రాష్ట్రాల ఏర్పాటు-కు ఉన్న రాష్ట్రం అనుమతి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంటూ రాజ్యాంగంలో ఆర్టికల్ 3ని పొందుపర్చా రన్నారు. మనం ఇప్పుడు తెలంగాణలో మాట్లాడుతున్నామంటే దానికి కారకుడు ఒకేఒక్కరు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని చెప్పారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదన్నారు.అంబేద్కర్ పేరువాడుకుని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని అడగాలి. ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ పేరుతో దళితులకు రూ.12 లక్షలు ఇస్తామని చేవెళ్లలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చెప్పించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డిని అడుగుతున్నా రెండు బడ్జెట్లు- పెట్టినవ్. ఇంకెప్పుడిస్తవ్ అంబేద్కర్ అభయ హస్తం. రూ.12 లక్షలు కాదుకదా రూ.12 కూడా ఇవ్వడని అందరికీ అర్థమైపోయింది. డబుల్ బెడ్‌రూమ్ పథకం కింద ఎస్సీ ఎస్టీలకు రూ.6 లక్ష ఇస్తానని చెప్పిండు. బాబాసాహెబ్ జయంతి సందర్భంగా నీ రూ.6 లక్షల మాట ఏమైందని అడుగుతున్నా. ఖర్గే ఎక్కడున్నడు, రాహుల్ గాంధీ ఎక్కడున్నడు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో మీరు చెప్పిన కథలన్నీ ఏమైనయ్. ఎస్సీ, ఎస్టీలకు 28 శాతం ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వాటా కలిపిస్తామని చెప్పారు.. ఇకెందుకు చేయలేదు రేవంత్ రెడ్డి?. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన హామీ ఏమైంది?. ఎస్సీ, ఎస్టీలకు విద్యాజ్యోతిల పథకం కింద 10వ తరగతి పాస్ అయితే రూ.10 వేలు, ఇంటర్ పాస్ అయితే రూ.15 వేలు, గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తే రూ.25 వేలు, పీజీ చేస్తే లక్ష, పీహెచ్డీలు చేస్తే రూ.5 లక్షలు ఇస్తామన్నారు.. ఏమైందని నేడు అడుగుతున్నా. రేవంత్ రెడ్డి దళిత సమాజానికి, ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మోదీ ప్రభుత్వం పేదల వ్యతిరేక ప్రభుత్వం. పేదలకు రూ.2000 పెన్షన్ ఇస్తే, రుణమాఫీ చేస్తే, ఉచిత కరెంట్ ఇస్తే మోడీకి నచ్చదు కానీ రూ.16.50 లక్షల కోట్లు- పెద్ద పెద్ద కార్పొరేట్లకు మాఫీ చేస్తే మోదీకి నచ్చుతుంది. తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ పార్టీ తుఫాన్ వేగంతో అధికారంలోకి వస్తుందని కేటీఆర్ అన్నారు.

## గచ్చిబౌలి భూముల ప్రధాని అసత్యాలు

**వివరాలు తెలుసుకోకుండా విమర్శలు.. ఎంపి చామల కిరణ్**

**ప్రజానావ, హైదరాబాద్:** కకంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ప్రధాని మోదీ వాస్తవాలకు దూరంగా మాట్లాడారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఇక్కడి బిజెపి నేతలు ఇచ్చిన తపపుడు సమాచారంతో మాట్లాడడం సరికాదన్నారు. నిజాలు తెలుసుకుని ఉంటే ఇలా మాట్లాడేవారు కాదన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కంచ గచ్చిబౌలి భూముల అంశంలో అందరూ అవాస్తవాలు మాట్లాడుతున్నారని అన్నారు. ఫేక్ వీడియోలు సృష్టించిన వారిపై ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ వేయగానే.. అందరూ వాటిని డిలీట్ చేశారని తెలిపారు. హరియాణా ప్రజలను ప్రధాని మోదీ తప్పుదోవ పట్టిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని దూషించాలని మోదీ ఈ విధంగా మాట్లాడుతున్నారు. తెలిసీ తెలియని సమాచారంతో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలు మీ కార్యాలయం ద్వారా తెలుసుకొని మాట్లాడండి. సన్న బియ్యం, భూభారతి లాంటి మంచి కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. బీసీ ప్రధాని అంటారు కదా.. మరి బీసీ కులగణన మీద మోదీ ఎందుకు మాట్లాడటం లేదని ఎంపి చామల ప్రశ్నించారు.

## ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ

**మంత్రులు ఉత్తమ్, దామోదర వెల్లడి**

**ప్రజానావ, హైదరాబాద్:** అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎస్సీ వర్గీకరణ జీవో విడుదల చేసినట్లు- మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ అన్నారు. ఏప్రిల్ 14 నుంచి ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ఈ సందర్భంగా చెప్పారు. ఎస్సీ వర్గీకరణ జీవోను విడుదల చేసిన మంత్రివర్గం.. తొలికాపీని సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం తొలి నుంచి ప్రయత్నం వేగవంతం చేశామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అన్నారు. వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టిస్తుందని చెప్పారు. 15 శాతం రిజర్వేషన్లలో అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు అమలు చేస్తామని.. ఇవాళ్టి నుంచి భారీ స్థాయిలో నోటిఫికేషన్లు ఇవ్వనున్నామని చెప్పారు. వర్గీకరణ గురించి గతంలో ఎవరూ పట్టించుకోలేద.. తమ ప్రభుత్వం వచ్చాకే వర్గీకరణ పూర్తైందని అన్నారు. సోషల్ జస్టిస్ కు కాంగ్రెస్ కట్టుబడి ఉన్నదనే దానికి నిదర్శనం అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో కేబినెట్ కమిటీ-వేసి ముందుకు వెళ్లినట్లు మంత్రి దామోదర తెలిపారు. ఏకసభ్య కమిషన్ నియమించి నిష్పాక్షింగా రిపోర్టు ఇచ్చినట్లు చెప్పారు. 90 రోజుల్లో షమీమ్ అక్తర్ కమిటీ- రిపోర్టు ఇచ్చిందని అన్నారు. వర్గీకరణ అంశంలో కొన్ని వేల విజ్ఞప్తులు వచ్చాయని.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు ఈ సందర్భంగా మంత్రి దామోదర తెలిపారు.

# పర్యావరణ ధ్వంసంలో కాంగ్రెస్ బిజీ

మొదటి పేజీ తరువాయి

గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే.. తెలంగాణలో అటవీ సంపదను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌కు కాంగ్రెస్ పార్టీ చేసిన అవమానం మనం ఎప్పటికీ మర్చిపోకూడదని ప్రధాని మోదీ అన్నారు. అంబేద్కర్ జీవించి ఉన్నప్పుడు, ఆ పార్టీ ఆయన్ను పదే పదే అవమానించిందని మండిపడ్డారు. రెండుసార్లు ఎన్నికల్లో ఓడిపోయేలా చేసిందని ఆగ్రహించారు. వ్యవస్థ నుంచి ఆయన్ను దూరంగా ఉంచేందుకు కుట్రలు చేసిందని ధ్వజమెత్తారు. అంబేద్కర్ మరణం తర్వాత, ఆయన జ్ఞాపకాలను తుడిచిపెట్టడానికి ప్రయత్నించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బాబాసాహెబ్ సమానత్వం కోసం నిలబడ్డారని, కానీ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఓటు బ్యాంకు రాజకీయాల వైరస్‌ను వ్యాప్తి చేసిందని ఆరోపించారు. అందుకే వక్ఫ్ సవరణ చట్టం-2025ను వ్యతిరేకిస్తూ మత ఛాందసాన్ని పెంచి పోషిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఓబీసీలను రెండో తరగతి పౌరులుగా మార్చారని ప్రధాని మోదీ ఆరోపించారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు ఎస్సీ, ఎస్టీ, బీసీల వర్గాలకు చేరాయో లేదో తెలుసుకునే విషయాన్ని సైతం కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. అధికారం పొందేందుకు రాజ్యాంగాన్ని ఓ ఆయుధంగా కాంగ్రెస్ మార్చిందని ధ్వజమెత్తారు. ఎమర్జెన్సీ సమయంలో అధికారాన్ని నిలుపుకోవడానికి అప్పటి కాంగ్రెస్ ప్రధాని.. రాజ్యాంగ స్ఫూర్తిని చంపేశారని విమర్శించారు. రాజ్యాంగం గురించి హస్తం పార్టీ నేతలు పదేపదే మాట్లాడతారని, కానీ దాన్ని ఎప్పుడూ అమలు చేయలేదని చురకలు అంటించారు. వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ వైఖరిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. ముస్లిం ఛాందసవాదులను బుజ్జగించడం




మాత్రమే కాంగ్రెస్‌కు తెలుసునని, కొత్త చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ స్వప్రయోజనాల కోసం వక్ఫ్ చట్టంలోని రూల్స్‌ను మార్చేసిందని ఆరోపించారు. ముస్లింలపై అంత ప్రేముంటే పార్టీ అధ్యక్షుడి పదవి ముస్లింలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో 50 శాతం టికెట్లు- వారికే ఇచ్చి, వారు గెలిచి ఉంటే తమ అభిప్రాయాలను వారు వ్యక్తం చేసి ఉండేవారు కాదా అని నిలదీశారు. ఎవరికీ మంచి చేయరాదన్నదే కాంగ్రెస్ ఉద్దేశమని అన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న నిరసనలపై ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో వక్ఫ్ రూల్స్‌ను తమ స్వార్థానికి మార్చేసిందని ఆరోపించారు. అధికారం కోసం పవిత్రమైన రాజ్యాంగాన్ని ఆయుధంలా వాడుకుంటూ.. ఓటు బ్యాంకు వైరస్‌ను వ్యాప్తి చేసిందని అన్నారు. ముస్లింలకు మద్దతుగా నిరసనలు చేపడుతున్న కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఎందుకు వారికి పార్టీలో ఉన్నత స్థానాలను ఇవ్వలేదని ప్రశ్నించారు. ముస్లిం అభ్యర్థులకు 50 శాతం ఎన్నికల టికెట్లను ఎందుకు రిజర్వ్ చేయలేదని నిలదీశారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ఈ విమానాశ్రయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ పాటించిన విధానాలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తినిస్తున్నా యన్నారు. కానీ.. దేశ ప్రజల కోసం ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అధికారం పొందేందుకు ఒక సాధనంగా వాడుకుంటోందని విమర్శించారు. ఇందిరాగాంధీ హయాంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అధికారాన్ని నిలుపుకోవడానికి రాజ్యాంగ స్ఫూర్తిని హత్య చేశారని దుయ్యబట్టారు. రాజ్యాంగ విలువల గురించి ప్రసంగాలు చేసే ప్రతిపక్ష నాయకులు ఎప్పుడూ వాటిని పాటించలేదని అన్నారు. పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం, 2025 ఇటీవల అమల్లోకి వచ్చింది. కాగా కేంద్రం తీసుకొచ్చిన కొత్త వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై విపక్ష పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మొత్తం 15 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై సర్వోన్నత న్యాయస్థానం ఏప్రిల్ 16న విచారణ జరపనుంది. మరోవైపు వక్ఫ్ సవరణల చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ఇది 14, 25, 26 ఆర్టికల్స్‌ను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో ముస్లింలు దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నారు. పశ్చిమ-బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన ఆందోళనల్లో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితులు అదుపుతప్పడంతో 110 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## సంపాదకీయం



# అంబేద్కర్ ఆశయాలకు తూట్లు!

అంబేద్కర్ ఆశయాలను పాటించడం.. ఆయన ప్రవచించిన సిద్ధాంతాలను అమలు చేయడం అన్నది పైకి కనిపిస్తున్న ముసుగు మాత్రమే. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య కాలంలో మన నాయకులంతా సమాజాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా కులాల కుంపట్లు రగిలిస్తున్నారు. ఇప్పుడు రాజకీయ పార్టీలకు, నాయకులకు ఆయన పేరును జపించడం నిత్యకృత్యం కావడం వెనక ఓటుబ్యాంక్ రాజకీయం తప్ప మరోటి లేదు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందాన అంబేద్కర్ పేరు చెప్పుకుని అణగారిన వర్గాలను బుట్టలో వేసుకోవడం అన్న కళలో మన నాయకులు ఆరితేరారు. ఆయనకు భారీ విగ్రహాలు పెట్టి దండలు వేసి చేతులు దులుపు కుంటున్నారు. ఆయన ఆశయాలను తుంగలో తొక్కామన్న భావన రాకుండా నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్నారు. ఎంతో జాగ్రత్తగా అన్ని రాజకీయ పార్టీలు అణగారిన వర్గాల ఓట్లకోసం అంబేద్కర్ పేరును వాడుకుంటున్నారు. నిజంగానే మనం అంబేద్కర్ మహానుభావుడి ఆశయాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామా లేదా అన్నది నేతలతో పాటు దళితులు కూడా ఆలోచన చేయాలి. ఎన్ని దళిత వాడలను పురుద్ధరించారో.. ఎందరికి చదువు, ఉద్యోగాలు కల్పించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి. అంబేద్కర్ ఆశించిన ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లడంలో రాజకీయ పార్టీలు చేస్తున్న మోసాలు గుర్తించాలి. దళితులంతా ఒక్కటే అన్న పట్టుదలతో సాగితే రాజకీయాల్లో పట్టు సాధించగలమని దళితులు గుర్తించాలి. అంతరాలు లేని సమాజం నిర్మించేందుకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులే కులాల కుంపట్లు సృష్టించి దేశంలో అసమానతలను పెంచి పోషిస్తున్నారు. దీంతో కులవ్యవస్థ మరింత బలంగా వేళ్లూనుకుని సమాజాన్ని అతలాకుతలం చేస్తోంది. దళిత జనోద్ధరణలో అన్ని పార్టీలది ఒకటే విధానంగా ఉంది. నేటికీ దళితుల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు లేవు. వారిని ఓటుబ్యాంక్‌గా చూస్తున్నారు తప్ప తమలో ఒకరిగా చూడడం లేదు. దీనికితోడు దళితుల్లో ఉపకులాల ద్వారా వారి ఐక్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే మాల, మాదిగ అంటూ దళితులే రోడ్డెక్కేలా చేస్తున్నారు. దీని ఆధారంగా ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నాల్లో ఉన్న ఆయా పార్టీల పన్నాగాలను దళితులు గుర్తించడం లేదు. ఏటా అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన విగ్రహాలకు దండలేయడం...కొత్తగా విగ్రహాలు పెట్టడం వరకే ప్రభుత్వాలు బాధ్యత వహిస్తున్నాయి. భారీ విగ్రహాలను పెట్టి దళితజనోద్ధరణ అంటూ కాలం గడిపేస్తున్నారు. నేతలు కూడా అంబేద్కర్ విగ్రహాలను పెట్టాలన్న డిమాండ్ తీసుకుని వచ్చి వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ రకంగా వారిని ఎప్పటికప్పుడు మోసం చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుం టున్నారే తప్ప వారిని తోటి మానవులుగా రాజకీయ నాయకులు భావించడం లేదు. వారికి సమాజంలో గౌరవం దక్కేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం లేదు. గ్రామాల్లో ప్రజలమధ్య వైషమ్యాలు లేకున్నా నాయకుల ఆలోచనలో అవి ఉన్నాయనడానికి మన నాయకుల తీరే నిదర్శనం. ప్రతి ఎన్నికల్లో అది బాగా కనిపిస్తోంది. ప్రధాని మోడీ అయితే అంబేద్కర్ పేరు ఉచ్చరించ కుండా ఉండలేకపోతున్నారు. ఆయనకు మేమిచ్చిన గౌరవం మరెవరూ ఇవ్వలేదంటున్నారు. కానీ ఈనాడు నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్న వారంతా ఉన్నత కులాలు వారే. వారు ఏనాడు దళితులను ఉన్నతికి తీసకుని వచ్చేందుకు ప్రయత్నించడం లేదు. రాష్ట్రపతిని చేయడం దళిత ఉద్ధరణ అనుకుంటారు. పాలనా పగ్గాలు వారి చేతుల్లో లేకుండా ఉత్సవ విగ్రహాలుగానే వారిని చూస్తున్నారు. దేశంలో పరిస్థితులు చూస్తుంటే అంబేద్కర్, పూలేలు ఎదుర్కొన్న వర్ణవివక్ష, కులవివక్ష జాడ్యాలు ఇంకా సమిసి పోయాయని చెప్పగలమా ? అంటే చెప్పలేం. ఇంతగా విద్య అందుబాటులోకి వచ్చినా ఇంకా వారు అణగారిన వర్గాలు గానే మిగిలిపోతున్నారు. ఒకటి రెండు పదవులు వారి మొహాన పడేసి దళితజన ఉద్ధరణ జరిగిందన్న ప్రచారం చేసుకుంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుంది. దళితబంధు, పెన్షన్లు వంటివి ఇచ్చి ఆహా.. ఓహో అంటూ కాలం గడుపు తున్నారు. దళిత ఉద్ధరణ గురించి గొప్పగా చెప్పుకునే కాంగ్రెస్ జగ్జీవన్ రామ్‌కు ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చినా అడ్డుకున్న చరిత్రను మరచిపోలేం.. అందుకే దళితనేతను పాలనకు దగ్గరగా చేసిన చరిత్రను చూడడం లేదు. దళితులను సిఎం చేస్తానన్న కెసిఆర్ సైతం వారిని ఓటుబ్యాంక్ కోసం మభ్యపెట్టారు. తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ ఊదరగొట్టి తెలంగాణ సమాజాన్ని మోసం చేసి, పదేళ్ల పాటు ఆయనే సిఎంగా కొనసాగారు. దళితబంధు పేరుతో అక్రమాలకు తెరతీసారు. రాజకీయ నాయకులు ఎలాగూ మంచి చేయరు. కనీసం ప్రజలుగా మనమంతా ఆ మహనీయుడికి నివాళి అర్పించేందుకు ఆయన చూపిన మార్గంలో నడిచే ప్రయత్నం చేయాలి.అంటరాని కులాలు ఆర్థికంగా బలపడనిదే, రాజకీయాధికారం పొందనిదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారం దొరకదని అంబేద్కర్ ఆనాడే ప్రకటించారు. వారికి రాజ్యాధికారం వస్తే తప్ప ఈ అంటరానితనం, చిన్నచూపు చూడడం వేరుగా చూడడం వంటి సమస్యలు సమిసిపోతాయని భావించాడు. భారత జాతీయ కాంగ్రెస్ నడిపే జాతీయోద్యమంలో అంటరానితన నిర్మూలన కోసం గాంధీ కృషి చేస్తూ ఉంటే ఆ కృషికి కాంగ్రెస్ సభ్యులనుండి పూర్తిస్థాయిలో మద్దతు లభించనేలేదు. గాంధీజి వర్ణ వ్యవస్థను భారత సమాజం ప్రత్యేక లక్షణమని, ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీలేని ఆర్థిక వ్యవస్థ భారత సమాజంలో ఉన్నదని సమర్థించాడు. ఆనాడే అంబేద్కర్‌ను ప్రధాని చేయాలన్న ఆలోచనకూడా గాంధీజీకి రాలేదు. ఇప్పటికైనా దళితులు ఐక్యత ప్రదర్శించాలి.

# రక్తమోడిన రోడ్లు



**ప్రజానావ, జనగామ/కడప:** తెలుగు రాష్ట్రాల్లో రోడ్లు రక్తమోడాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఒంటిమిట్ట నడింపల్లి వద్ద జీపు అతివేగంగా వచ్చి.. ఆర్టీసీ బస్సుతో పాటు పోలీస్ వాహనాన్ని ఢ కోట్టింది. ప్రమాదంలో జీపులో ఉన్న ముగ్గురు వ్యక్తులు ఘటన స్థలంలోనే మృతి చెందారు. మూడు వాహనాలు ఢీ కొని ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి వైపు నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన స్కార్పియో వాహనం.. ఆర్టీసీ బస్సు, పోలీసు రక్షక వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో స్కార్పియోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందారు. మృతులను నంద్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వారిగా గుర్తించారు. పోలీసు వాహనంలో ఉన్న కానిస్టేబుల్ రఘునాథరెడ్డితోపాటు- డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కడప రిమ్స్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నారు. స్కార్పియో వాహనం నుజ్జునుజ్జయింది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఒంటిమిట్ట, రాజంపేటకు చెందిన పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే తెలంగాణలోని జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు-చేసుకుంది. స్టేషన్ ఘనపూర్ మండలం రాఘవాపూర్ శివారు జాతీయ రహదారిపై లారీని వెనక నుంచి కారు ఢీకొట్టింది. ప్రమాద ధాటికి కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ప్రమాద స్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. హనుమకొండ నుంచి హైదరాబాద్ కియా కారు వెళుతున్నట్లు- పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.



# పార్క్ హయత్‌లో అగ్నిప్రమాదం

### క్రికెటర్లకు తప్పిన ముప్పు

**ప్రజానావ, హైదరాబాద్: వేసవి** కాలంలో పలు అగ్నిప్రమాదాలు చోటు- చేసుకున్న విషయం తెలిసిందే. వరుస అగ్నిప్రమాదాలతో నగరం ఉలిక్కిపడుతోంది. ఇప్పుడు తాజాగా ఓ ప్రముఖ హోటల్‌లో మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో హోటల్ సిబ్బంది వెంటనే అప్రమత్తమైంది. అయితే ఇదే హోటల్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ కూడా బస చేయడంతో ఒకింత ఆందోళన నెలకొంది. నగరంలోని బంజారాహిల్స్ పార్క్‌హయత్‌లో సోమవారం ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. పార్క్‌హయత్‌లోని మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు అలముకున్నాయి. వెంటనే అప్రమత్తమైన హోటల్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది త్వరితగతిన మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అయితే ప్రమాదం ఎలా జరిగింది... మంటలు ఏ విధంగా అంటు-కున్నాయి అనే వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది. అయితే పార్క్‌హయత్ హోటల్‌లోనే హైదరాబాద్ సన్‌రైజర్ టీ-ం బస చేస్తోంది. ఈ హోటల్‌లోనే ప్రమాదం జరగడంతో అభిమానులు ఒకింత భయాందోళనకు గురయ్యారు. కానీ సన్‌రైజర్ టీంకు ఎలాంటి ప్రమాదం జరగలేదని.. ప్లేయర్లు అంతా సేఫ్‌గా ఉన్నారని హోటల్ సిబ్బంది తెలపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# సన్నబియ్యంతో ఊరంతా పండగ

### వచ్చిన బియ్యంతో వండి వార్చిన ఇల్లాలు
### అందరికీ కడుపారా భోజనం పెట్టిన లక్ష్మి
### సిద్దిపేట జిల్లా ఘటనపై సిఎం ఆనందం
### ఇల్లాలు లక్ష్మిని అభినందిస్తూ ట్వీట్

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడంతో సంతోషంలో ఓ ఇల్లాలు తన చుట్టుపక్కల వారికి బంతి భోజనం పెట్టి ఆనందాన్ని ప్రకటించింది. ఇది కాస్తా సిఎం రేవంత్ దృష్టిలో పడడంతో ఆయన ఆ ఇల్లాలును అబినందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది కాంగ్రెస్ సర్కార్. రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కూడా కాంగ్రెస్ హామీ అమల్లోకి వచ్చింది. ఇచ్చిన హామీ మేరకు ఉగాది కానుకగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదలుపెట్టారు. ఇప్పటి వరకు రేషన్ కార్డుదారులకు వస్తున్న దొడ్డు బియ్యానికి



బదులుగా సన్న బియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తోంది. ప్రతీ రేషన్‌కార్డుదారునికి ఆరు కిలోల చెప్పున్న సన్న బియ్యాన్ని ఇస్తున్నారు. రేషన్ షాపుల్లో సన్నబియ్యం రావడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భద్రాచలంలో సిఎం ఓ పేద ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనం రుచి చూశారు. తాజాగా సిద్ధిపేట జిల్లాకు చెందిన ఓ మహిళకు కూడా రేషన్‌కార్డు ద్వారా సన్న బియ్యం వచ్చింది. దీంతో ఎంతో ఆనందం వ్యక్తం చేసిన ఆ మహిళ.. తన ఆనందాన్ని నలుగురితో పంచుకోవాలని అనుకుంది. అనుకున్నదే తడవుగా తన చుట్టుపక్కల వారికి బంతిభోజనం పెట్టింది. సిద్ధిపేట జిల్లా అక్బర్ పేట గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళకు రేషన్‌కార్డు ద్వారా 24 కిలోల సన్నబియ్యం వచ్చింది. ఇన్ని రోజులుగా దొడ్డు బియ్యం వస్తుండగా.. ఇప్పుడు సన్న బియ్యం రావడం పట్ల ఆనందం వ్యక్తం చేసింది. అంతటితో ఆగకుండా తనకు వచ్చిన 24 కిలోల సన్న బియ్యంతో ఊరందిరినీ పిలిచి సహపంక్తి భోజనం పెట్టింది. దీంతో ఆ ఊరి ప్రజలు కూడా సన్న బియ్యంతో వండిన భోజనాన్ని కడుపారా తిన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది. దీంతో లక్ష్మిని సిఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ తెలియజేశారు. 'సిద్ధిపేట జిల్లా అక్బర్ పేట గ్రామానికి చెందిన కూతురి లక్ష్మికి నా ప్రత్యేక అభినందనలు. తనకు వచ్చిన 24 కిలోల సన్న బియ్యంతో ఆమె ఊరందరికి సహపంక్తి భోజనం పెట్టి, ఈ పథకం పేదల జీవితాల్లో ఎంతటి ఆనందాన్ని నింపిందో చెప్పే ప్రయత్నం చేసింది. సన్నబియ్యం లబ్ధిదారులే మా ప్రభుత్వ బ్రాండ్ అంబాసిడర్లు' అంటూ సీఎం రేవంత్ ట్వీట్ చేశారు. అంతేకాకుండా లక్ష్మి చేసిన పనికి నెటిజన్లు కూడా ఆమెను అభినందిస్తున్నారు.

# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

మంగళవారం
15 ఏప్రిల్ 2025






# అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకెళ్లాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- వేములవాడలో అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణ, విగ్రహావిష్కరణ



**ప్రజానావ, వేములవాడ:** బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో రూ.30 లక్షలతో అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణలో భాగంగా నూతన అంబేద్కర్ చౌరస్తా, కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, ఎస్పీ మహేష్ బీ గీతే, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ నాగుల సత్యనారాయణతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం విప్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా వేములవాడ లోని అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోకాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని వివరించారు.మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ అంబేద్కర్ చౌరస్తా వద్ద కొత్త శోభ సంతరించుకునేలా రూ.30 లక్షల తో కూడలి అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో మాట్లాడి ప్రత్యేక చొరవ తీసుకొని కూడలిని అభివృద్ధి చేయించారని తెలిపారు. ఒక బీసీ బిడ్డగా తాను అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించానని వివరించారు. అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో తోడ్పాటు అందించారని కొనియాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అమలు చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు.

### ఎస్సీ వర్గీకరణ అమలు చేయబోతున్నాం

ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లుకు శాసనసభలో ఆమోదం తెలిపిందని, 30ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ చేయడం జరిగిందని విప్ వివరించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయబోతున్నామని, వేములవాడ నియోజకవర్గకేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మాణానికి ఎకరం భూమి సేకరించి, నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా వేములవాడ అభివృద్ధి చేయిస్తానని స్పష్టం చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధికి గత బడ్జెట్ లో రూ.50 కోట్లు, ఇటీవల బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. అన్నదాన సత్రం రూ.35 కోట్లతో నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. వేములవాడ పట్టణ అభివృద్ధి, రాజన్న ఆలయ అభివృద్ధి రెండు కళ్లలా ముందుకు పోతున్నామని విప్ తెలిపారు.

### ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాభివృద్ధి

ఆగమ శాస్త్రం ప్రకారంగా రాజన్న ఆలయ అభివృద్ధి చేయిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శృంగేరి పీఠాధిపతి, బ్రాహ్మణుల నుంచి సూచనలు తీసుకొని ముందుకు పోతున్నామని స్పష్టం చేశారు. రాజన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. రాజన్నకుహప్రతిరోజూ జరిగే ప్రతి పూజలు యథావిధిగా జరుగుతాయని, త్వరలోనే రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. వేములవాడ రెండో బైపాస్ రోడ్డులో రూ.80లక్షలతో కూరగాయల మార్కెట్ సముదాయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంస్య విగ్రహాన్ని తన చేతులమీదగా ఆవిష్కరణ చేయడం పూర్వ జన్మ సుకృతమని వివరించారు. రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ సీపీ నివాళులు

ప్రజానావ, కరీంనగర్: భారతరత్న డాక్టర్‌బీఆర్‌అంబేద్కర్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పూలమాలవేసి నివాళులర్పించారు.

# అగ్నిమాపక వారోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ




**ప్రజానావ, సిరిసిల్ల:** ముంబయి విక్టోరియా డాకయార్డ్‌లో 1944 ఏప్రిల్14న ఓ నౌకకు అగ్ని ప్రమాదం సంభవించడంతో విధి నిర్వహణలో ఉన్న 66 మంది అగ్నిమాపక దళ సిబ్బంది అసువులు బాసారు. వారి స్మారకార్థం ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20వరకు వారం రోజుల పాటు దేశవ్యాప్తంగా అగ్నిమాపక దళ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకు సంబంధించి రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి గీతే గోడపత్రికలను ఆవిష్కరించారు. ఇందులో అగ్నిమాపక కేంద్రం సిరిసిల్ల ఎస్ఎఫ్ఓ ఎన్. నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఈ నెల 20వరకు వారం రోజుల పాటు అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ, నియంత్రణ చర్యల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి శుద్ధి



**ప్రజానావ, సిరిసిల్ల:** అంబేద్కర్ జయంత్యుత్సవాన్ని సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపీ అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్డిబోయిన గోపీ అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి దీపాలతో అలంకరించారు. అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ ఎన్నోసార్లు అవమానించిందని, ఆయన ఆనవాళ్లను సమూలంగా తుడిచి పెట్టాయాలని ప్రయత్నంచిందన్నారు. అంబేద్కర్‌ను సంపూర్ణంగా గౌరవించింది బీజేపీ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మ్యాన రాంప్రసాద్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్ యాదవ్, కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, అంబేద్కర్ జయంతి కన్వీనర్ చంటి మహేశ్, కో కన్వీనర్ కొంపల్లి రాజేందర్, యాదగిరి, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పల్లం అన్నపూర్ణ, కన్వీనర్లు, కో కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాజ్యాంగ నిర్మాతకు నివాళి

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ అర్బన్ మండలం చింతలఠాణా గ్రామంలో సోమవారం డా.బీఆర్. అంబేదర్కర్ జయంత్యుత్సవాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అందరూ అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వర రావు, జిల్లా నాయకులు సురువు వెంకట్, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి ప్రశాంత్, దళిత మోర్చా అధ్యక్షులు గంట మహేశ్, అంజన్న యాదవ్, మండల ఉపాధ్యక్షుడు బిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల కార్యదర్శి చొక్కాల మధు, సంజీవ్ రెడ్డి, కోశాధికారి సోలంకి అరవింద్, మండల కార్యవర్గ సభ్యులు గడ్డి ప్రశాంత్, బూత్ అధ్యక్షులు బాలకృష్ణ, ముదం శ్రీనివాస్, చొక్కాల ప్రశాంత్, గొడుగు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

**ప్రజానావ, వేములవాడ:** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎన్.తుకరాంజీతో కలిసి ఏపీ, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తులు ఏ.హరిహర నందశర్మ, ఎం.లక్ష్మణ్ సోమవారం వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారంన్యాయమూర్తులకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి కల్యాణ మండపంలో న్యాయమూర్తులకు ఆలయ ఈఓ కే. వినోద్ శేషవస్త్రం కప్పి లడ్డూ ప్రసాదం అందజేశారు. వీరి వెంట సిరిసిల్ల జిల్లా జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, స్థానిక తహసీల్దార్ కే. విజయ ప్రకాశ్ రావు, ప్రోటోకాల్ ఏఈఓ జీ. అశోక్ కుమార్, ప్రోటోకాల్ పర్యవేక్షకుడు శ్రీకాంత్ చార్యులు, ఆలయ సిబ్బంది, కోర్టు సిబ్బంది ఉన్నారు.





खైరతాబాద్ బడా గణేశ్ సర్కిల్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన డా. బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలకు ఎంఎల్‌సీ కల్వకుంట్ల కవిత, జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటం మెమెంటోను అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ప్రజానావ, ఖైరతాబాద్



# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుక

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను అధికారులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. నిమ్మపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహానీయుడైన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మాదిగ, మాల కుల సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# అంబేద్కర్ అందరివాడు

- ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన ప్రభుత్వ విప్, కలెక్టర్ ఎస్పీ, ప్రజా ప్రతినిధులు



**ప్రజానావ, సిరిసిల్ల:** భారత రాజ్యాంగ నిర్మాత , భారతరత్న బీఆర్ అంబేద్కర్ అందరివాడని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ 134వ జయంత్యుత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్లమార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప తదితరులు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

### అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేద్దాం

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి గ్రామం, పట్టణంలోనే కాకుండా పలు దేశాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించడం గర్వకారణం అని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లో ఈ స్థాయికి ఎదిగానని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్ర శాసనసభ ఆమోదించిందని, శాసనసభలో బీసీ బిల్లును బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రవేశపెట్టారని, దానిని బలపరిచే అవకాశం బీసీ బిడ్డగా తనకు రావడం మర్చిపోలేని మంచి అనుభూతి అని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ కూడా అమలు కానుందని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఎస్సీ స్టడీ సర్కిల్ నిర్మాణానికి ఒక ఎకరం భూమి, నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని ఎస్సీల సమస్యలను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులు సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలనిసంఘాల నాయకులకు సూచించారు. ప్రభుత్వం దాదాపు రూ.20వేల కోట్ల రుణమాఫీ చేసిందని, అర్హులైన ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తుందని, మహిళలందరికీ ఉచితంగా బస్సు సేవలు అందిస్తుందని, పేద, ధనిక తేడా లేకుండా అందరూ సన్న బియ్యం తినాలని మహోన్నత ఉద్దేశంతో పథకాన్ని అమలు చేస్తుందన్నారు. నేత కార్మికుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, రూ. 50 కోట్లతో యార్న్ బ్యాంకు ఏర్పాటు చేసుకున్నామని, నేతన్నలందరికీ ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో చీరల ఉత్పత్తికి ఆర్డర్ ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ శాఖలకు అవసరమయ్యే అన్ని ఆర్డర్లు సిరిసిల్లకు అందించేలా ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజా మనోహర్ రావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు విజయలక్ష్మి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, దళిత సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆశయాల దిశగా ముందుకు సాగాలి

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి గితే

**ప్రజానావ, వేములవాడ:** మహానీయులను స్మరిస్తూ మాతృదేశానికి సేవ చేయడమే వారికి మనమిచ్చే అసలైన నివాళి అని ఎస్పీ మహేశ్ఖ బి గితే అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల దిశగా ప్రతి ఒక్కరూ ముందుగు సాగాలని పిలుపునిచ్చారు. సామాజిక వివక్షను జయించి, అత్యున్నత విద్యను సాధించిన గొప్ప మేధావిగా, భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా ఉండడానికి కీలక పాత్ర పోషించిన వ్యక్తి భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ అని ఆయన సేవలను కొనియాడారు. అంబేద్కర్ జీవితం బోధనల నుంచి ప్రేరణ పొంది, ఆయన ఆశయల దిశగా నేటి యువత నడుం బిగించి ఆయనను ఆదర్శంగా స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజానావ, కరీంనగర్:** మానవసేవయే మాధవసేవ అనే నినాదంతో నగరానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ దారుల్ ఖైర్ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక కార్యక్రమాలు అభినందనీయమని మతీన్ అండ్ ఫ్రెండ్స్ అధ్యక్షుడు తాడ వీరారెడ్డి, హరి కుమార్ అన్నారు. నగరంలోని సోమవారం అంగడి ప్రాంతంలో దారులు ఖైర్ ఆధ్వర్యంలో వేసవికాలం దృష్ట్యా బాటసారులకు వ్యాపారులకు, కొనుగోలుదారుల సౌకర్యార్థం, వివిధ గ్రామాల నుంచి కరీంనగర్ కు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడం కోసం చల్లని మినరల్ వాటర్ కూల్ క్యాన్లను ఏర్పాటు చేశారు. ఇది నిరంతరంగా వేసవికాలం ముగిసే వరకు నిర్వహిస్తామని నిర్వాహకులు డాక్టర్ అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. ఈ సందర్భంగా వీరారెడ్డి, హరి కుమార్ లు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కోసం అనునిత్యం పరితపిస్తూ హిందూ ముస్లిం భాయి భాయి అనే నినాదంతో దారులు ఖైర్ స్వచ్ఛంద సేవా సంస్థ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మతిన్, దారుల్ ఖైర్ సభ్యులు అహ్మద్ అల్ జైదీ, నజీబ్ అహ్మద్, అబ్దుల్ వసీ, మహమ్మద్ ఉస్మాన్, అజీమ్ ఖాన్, అబ్దుల్ అజీజ్, జమాలొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిలింనగర్‌లో అంబేద్కర్ జయంతి

### నివాళులర్పించిన ఎమ్మెల్యే దానం నాగేందర్



**ప్రజానావ, ఖైరతాబాద్:** అంబేద్కర్ జయంత్యుత్సవాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో ఘనంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కేవలం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మాత్రమే చెందినవాడు కాదని, ఆయన మన అందరి దైవమన్నారు. భారత రాజ్యాంగ రూపశిల్పిగా, బహుముఖ ప్రజ్ఞశాలిగా, నిరాజనాలు అందుకుంటున్న మహనీయుడు అని ఆయన చేసిన సేవలను కొనియాడారు. అంబేద్కర్ మనకు అందించిన ఆదర్శ మార్గంలో పయనిస్తూ ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేశ్, మామిడి నర్సింగ్ రావు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, వివిధ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు చింతల ఘన నివాళి



**ప్రజానావ, ఖైరతాబాద్:** అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అంబేద్కర్ బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

### తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ. లచ్చిరెడ్డి

**ప్రజానావ, ఖైరతాబాద్:** రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం 2025 అమల్లోకి తీసుకొచ్చి రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మాణం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రెవెన్యూ ఉద్యోగులమంతా రుణపడి ఉంటామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ. లచ్చిరెడ్డి అన్నారు. భూ భారతి చట్టం - 2025 ప్రారంభోత్సవం సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తరపున, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ తరపున, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ తరపున, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తరపున సీఎం రేవంత్ రెడ్డిని కలిసి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలో ఎక్కడా లేని సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సృష్టించి, రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతులకు బాటలు వేశారని కొనియాడారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్, జనరల్ సెక్రటరీ కే.రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్ష, కార్యదర్శులు రాములు, రమేశ్ పాక, టీజీఆర్ఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, భిక్షం తదితరులున్నారు.

## వివక్షపై అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు అంబేద్కర్

### జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

**ప్రజానావ, ఖైరతాబాద్:** ఆర్థికవేత్త, న్యాయ కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, అంటరానితనం, వివక్షలపై అలుపెరగని పోరాటం, దళిత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన మహనీయుడు డా.బీఆర్ అంబేద్కర్ అని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ కొనియాడారు. అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరిచుకొని జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్‌లోని మహనీయుల విగ్రహాల చౌరస్తా వద్ద ఆయన అంబేద్కర్‌కు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కృష్ణ, రమేశ్, అశోక్, మహేశ్, లక్ష్మయ్య, హసన్ అలీ, అబ్దుల్ వహీద్, షాహీన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
మంగళవారం
15 ఏప్రిల్ 2025




# చెన్నై గెలిచింది..

## లఖ్‌నవూపై విజయం

**లక్నో:** వరుస పరాజయాలతో సతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు ఓ విజయం సాధించింది. ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. చెన్నై కెప్టెన్ ధోనీ (26 నాటౌట్), శివమ్ దూబె (43 నాటౌట్) కీలక పరుగులు చేసి చెన్నైకు విజయాన్ని అందించారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న లఖ్‌నవూ జోరుకు చెన్నై బ్రేకులు వేసింది. లఖ్‌నవూలోని ఏకనా స్టేడియంలో ఈ రోజు (ఏప్రిల్ 14) లఖ్‌నవూ, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో లఖ్‌నవూపై చెన్నై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన చెన్నై కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ బౌలింగ్ ఎంచుకున్నాడు. వ్యూహం ప్రకారం బౌలింగ్ చేసిన చెన్నై బౌలర్లు లఖ్‌నవూ హార్డ్ హిట్టర్లను కట్టడి చేశారు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై చెన్నై బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి బౌలింగ్ చేశారు. దీంతో లఖ్‌నవూ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. అయితే పంత్ (63) అర్ధశతకం సాధించి జట్టుకు ఫైటింగ్ స్కోరు అందించాడు. మిచెల్ మార్ష్ (30) మరోసారి తన ఫామ్‌ను కొనసాగించాడు. ఆయుష్ బదోనీ (22), అబ్దుల్ సమద్ (20) కీలక పరుగులు చేశారు. దీంతో లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ ఒక్కో వికెట్ తీశారు.అనంతరం 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకు అదిరిపోయే ఆరంభం లభించింది. రచిన్ రవీంద్ర (37), రషీద్ (27) తొలి వికెట్‌కు 50 పరుగులకు పైగా జోడించారు. అయితే ఓపెనర్లు ఇద్దరూ అవుటైన తర్వాత చెన్నై గెలుపుపై అనుమానాలు మొదలయ్యాయి. రాహుల్, రవీంద్ర జడేజా, విజయ్ శంకర్ సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు.



అయితే శివమ్ దూబే (43), ఎంఎస్ ధోనీ (26) సమయోచితంగా ఆడుతూ చెన్నైను విజయ తీరాలకు చేర్చారు. లఖ్‌నవూ బౌలర్లలో రవి బిష్ణోయ్ రెండు వికెట్లు తీశాడు. మార్‌క్రమ్, దిగ్వేష్, ఆవేష్ ఖాన్ ఒక్కో వికెట్ తీశారు.



# ఐపీఎల్ కెప్టెన్స్‌కు బీసీసీఐ షాక్..

### ఏకంగా ఆరుగురికి పెనాల్టీ

ముంబై : ఐపీఎల్-2025 మొదలై చూస్తుండగానే మూడు వారాలు పూర్తయ్యాయి. ఈ వీక్‌లో ఒకదాన్ని మించి మరో మ్యాచ్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తోంది. చాలా వరకు మ్యాచులు లాస్ట్ ఓవర్స్ దాకా వెళ్తుండటంతో ఆడియెన్స్‌లో ఎగ్జయిట్‌మెంట్ మరింత పెరిగింది. అయితే అంతా బాగానే ఉన్నా క్యాష్ రిచ్ లీగ్‌లోని టీమ్స్ కెప్టెన్స్‌తో భారత క్రికెట్ బోర్డు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. వరుసగా ఒకరి తర్వాత ఒకరి మీద కొరడా ఝుళిపిస్తోంది బీసీసీఐ. మరి.. బోర్డు ఎందుకిలా చేస్తోంది.. కెప్టెన్స్ చేసిన తప్పేంటి.. అనేది ఇప్పుడు చూద్దాం..

### ఆ లిస్ట్‌లోకి అక్షర్..

ఢిల్లీ క్యాపిటల్స్ సారథి అక్షర్ పటేల్‌కు షాక్ ఇచ్చింది బీసీసీఐ. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో ఓవర్లు నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయకపోవడంతో అతడికి రూ. 12 లక్షలు ఫైన్ వేసింది బోర్డు. ఈ సీజన్‌లో స్లో ఓవర్ రేట్ కింద సారథులు జరిమానా ఎదుర్కోవడం కామన్ అయిపోయింది. ఇప్పటికే సంజూ శాంసన్-రియాన్ పరాగ్ (రాజస్థాన్ రాయల్స్), రిషబ్ పంత్ (లక్నో సూపర్ జెయింట్స్), రజత్ పాటిదార్ (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు), హార్దిక్ పాండ్యా (ముంబై ఇండియన్స్) ఈ లిస్ట్‌లో ఉన్నారు. నిన్నటి మ్యాచ్‌తో అక్షర్ కూడా ఈ జాబితాలో చేరాడు.

### ఎందుకిలా..

సాధారణంగా ప్రతి ఐపీఎల్ సీజన్‌లో కొన్ని మ్యాచుల్లో ఇలా స్లో ఓవర్ రేట్స్ నమోదవుతుంటాయి. దీని కింద ఆయా జట్ల కెప్టెన్స్‌కు జరిమానా విధిస్తుంటారు. అయితే ఈసారి లీగ్ ఇంకా సగం కూడా పూర్తవక ముందే ఏకంగా ఆరుగురు సారథులకు ఫైన్ వేయడంతో ఇది హాట్ టాపిక్‌గా మారింది. కాగా, నిన్న ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 12 పరుగుల తక్కువ మార్జిన్‌తో ఓటమిపాలైంది. అసలే టీమ్ పరాభవం పాలవడంతో నిరాశలో ఉన్న అక్షర్ పటేల్‌కు స్లో ఓవర్ రేట్ కింద ఫైన్ వేయడం మింగుడు పడని విషయమేనని చెప్పాలి.



# డేంజరస్ పేసర్ వచ్చేస్తున్నాడు..

### ఆ జట్టును ఆపతరమా..!

ముంబై : ఐపీఎల్ 18వ సీజన్‌లో అభిమానుల నిరీక్షణ ఫలించనుంది. మేటి బ్యాటర్లను సైతం వణికించే డేంజరస్ పేసర్ మయాంక్ యాదవ్ వచ్చేస్తున్నాడు. గత ఎడిషన్లో నిప్పులు చెరిగిన ఈ స్పీడ్‌స్టర్ త్వరలోనే జోరుమీదున్న లక్నో సూపర్ జెయింట్స్ స్క్వాడ్‌తో కలవనున్నాడు. గాయాల కారణంగా దాదాపు ఆరు నెలలుగా క్రికెట్‌కు దూరమైన మయాంక్ తాజాగా ఫిట్‌నెస్ సాధించాడు. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో కోలుకున్న అతడు బౌలింగ్ ప్రాక్టీస్‌లోనూ మునపటిలా సత్తా చాటాడు. దాంతో, ఏప్రిల్ 15వ తేదిన అతడికి ఎన్‌సీఏ నిర్వాహకులు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వనున్నారు. అది రావడమే ఆలస్యం ఈ స్పీడ్‌స్టర్ లక్నో శిబిరంలో చేరడం ఖాయమంటున్నాయి విశ్వసనీయ వర్గాలు. ఇంతకుముందే మయాంక్ త్వరలోనే జట్టుతో కలుస్తాడని లక్నో కోచ్ జస్టిన్ లాంగర్ సంకేతాలు ఇచ్చిన విషయం తెలిసిందే.

### 4 మ్యాచుల్లో 7 వికెట్లు

కుడిచేతివాటం పేసర్ అయిన మయాంక్ యాదవ్ పదిహేడో సీజన్‌లో తన పేస్‌తో అదరగొట్టాడు. గంటకు 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు సంధించి వరల్డ్ క్లాస్ బ్యాటర్లకు సైతం చెమటలు పట్టించాడు. 4 మ్యాచుల్లో 7 వికెట్లు తీసి లక్నో విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత గాయం కారణంగా సీజన్‌కు దూరమయ్యాడు. అయితే.. ఐపీఎల్ ఫామ్‌తో ఆ తర్వాత భారత టీ20 జట్టుకు ఎంపికైన మయాంక్.. అద్భుతంగా రాణించాడు. అయితే.. వెన్నుభాగంలో నొప్పితో ఆరు నెలలు ఆటకు దూరమయ్యాడు.

# రిటైర్మెంట్ ముచ్చటే లేదు..

### అప్పటిదాకా ఆడుతూనే ఉండాలి



**ముంబై :** క్రికెటర్ల రిటైర్మెంట్‌పై ఎప్పుడూ ఏవో ఒక ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. మరీ ముఖ్యంగా స్టార్ ప్లేయర్లు ఎప్పటివరకు ఆడతారనే దానిపై తరచూ డిస్కషన్స్ జరుగుతూనే ఉంటాయి. టీమిండియా టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, సారథి రోహిత్ శర్మ కెరీర్‌పై కూడా ఇలాంటి చర్చలు చాన్నాళ్లుగా జరుగుతున్నాయి. ఇప్పటికే వీళ్లిద్దరూ టీ20లకు గుడ్‌బై చెప్పేశారు. వన్డేలు, టెస్టుల్లోనే కొనసాగుతున్నారు. అయినా రిటైర్మెంట్ రూమర్స్ తగ్గడం లేదు. దీనిపై యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ స్పందించాడు. అప్పటివరకు వాళ్లు ఆడుతూనే ఉంటారన్నాడు.

**అప్పటివరకు ఆగొద్దు**

కోహ్లీ-రోహిత్‌లో మరింత క్రికెట్ మిగిలి ఉందన్నాడు గేల్. వాళ్ల ఏజ్ కూడా తక్కువేనన్నాడు. రిటైర్మెంట్ తీసుకోమంటూ వాళ్లపై ఒత్తిడి పెంచడం సరికాదన్నాడు వెస్టిండీస్ గ్రేట్. ఇలాంటి గొప్ప ఆటగాళ్లు గేమ్‌లో కొనసాగడం చాలా అవసరమని స్పష్టం చేశాడు గేల్. ఇంటర్నేషనల్ క్రికెట్‌కు ఇలాంటి ప్లేయర్లు అందించే సేవలు ఎంతో ముఖ్యమని తెలిపాడు. వాళ్ల తర్వాత కూడా క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లే ఆటగాళ్లు వస్తారని.. కానీ సాధ్యమైనంత ఎక్కువ కాలం కోహ్లీ-రోహిత్ ఆడుతూనే ఉండాలని కోరాడు.

**ఆ నాక్‌కు మతిపోయింది**

గతంలో ఆర్సీబీకి ఆడిన గేల్.. ఈ ఐపీఎల్ సీజన్ గురించి కూడా రియాక్ట్ అయ్యాడు. ఈ ఎడిషన్‌లో బెంగళూరు జట్టుగా నిలకడగా ఆడటం, వరుస విజయాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌ను వాళ్ల సొంతగడ్డ మీద ఓడించడం సూపర్ అన్నాడు గేల్. కొత్త కెప్టెన్ రజత్ పాటిదార్ ఆర్సీబీని అద్భుతంగా నడిపిస్తున్నాడని, అతడు ఇదే రీతిలో జట్టును మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆశిస్తున్నానని చెప్పుకొచ్చాడు విండీస్ లెజెండ్. 141 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మనూ ప్రశంసల్లో ముంచెత్తాడు గేల్. అతడి నాక్ మైండ్‌బ్లోయింగ్ అని మెచ్చుకున్నాడు.

## పంజాబ్ కింగ్స్‌కు పెద్ద షాక్.. గాయంతో స్టార్ పేసర్ ఔట్..!



**హైదరాబాద్:** సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమిపాలైన పంజాబ్ కింగ్స్‌కు పెద్ద షాక్. ఆ జట్టు ప్రధాన పేసర్ లాకీ ఫెర్గూసన్ టోర్నీ మొత్తానికి దూరం కానున్నాడు. ఉప్పల్ మైదానంలో బౌలింగ్ చేస్తుండగా కండరాల నొప్పితో ఫెర్గూస్ మైదానం వీడాడు. అయితే.. ఈ స్పీడ్‌స్టర్ ఎప్పుడు అందుబాటులోకి వస్తాడో తెలియదని అంటోంది పంజాబ్ యాజమాన్యం. దాంతో, పంజాబ్ తర్వాతి మ్యాచ్‌లకు ఈ పేస్ గన్ దూరమయ్యే అవకాశం ఉంది. 'ఫెర్గూసన్ మళ్లీ జట్టుతో కలిసి మైదానంలోకి దిగేది ఎప్పుడనేది చెప్పలేం. కనీసం ఆఖరి మ్యాచ్‌లకు అయినా అతడు అందుబాటులో ఉండడం అసాధ్యం అనిపిస్తోంది. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో ఫెర్గూసన్ పెద్ద గాయమే చేసుకున్నాడు' అని సోమవారం పంజాబ్ ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్ వెల్లడించాడు. ఈ సీజన్‌లో 4 మ్యాచుల్ ఆడిన ఈ కివీ పేసర్ 5 వికెట్లు పడగొట్టాడు. అతడికి ప్రత్యామ్నాయంగా గ్జావియర్ బార్ట్‌లెట్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్‌ల పేర్లను పరిశీలిస్తోందని సమాచారం.

# ఒక్క మాటతో రిజల్ట్ తారుమారు..

### ఇందుకే రోహిత్ గ్రేట్ అనేది



**ముంబై :** క్రికెట్‌లో ఆటగాళ్లందరి కంటే కూడా కెప్టెన్ ఎక్కువ అలర్ట్‌గా ఉండాలి. మ్యాచ్‌ను నిశితంగా పరిశీలిస్తూ సరైన సమయానికి సరైన నిర్ణయాలు తీసుకుంటూ టీమ్‌ను పోటీలో ఉంచాలి. మ్యాచ్ చేజారే ప్రమాదం ఏర్పడితే.. అప్పటికప్పుడు కొత్త వ్యూహాలు పన్నాలి. అయితే సారథి ఒక్కడితోనే అంతా అయిపోదు. అతడికి సీనియర్ ఆటగాళ్లు కూడా సాయం అందించాలి. స్ట్రాటజీ ప్లానింగ్‌లో హెల్ప్ చేయాలి. అప్పుడే టీమ్ విజయపథంలో దూసుకెళ్తుంది. ఐపీఎల్-2025లో భాగంగా ముంబై ఇండియన్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌లో ఇది మరోమారు ప్రూవ్ అయింది. ఎంఐ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు మాజీ సారథి రోహిత్ శర్మ ఇచ్చిన ఒక సలహా మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. మరి.. ఆ సజెషన్ ఏంటో ఇప్పుడు చూద్దాం..

**రిస్క్ చేసి మరీ..**

ముంబై వర్సెస్ డీసీ మ్యాచ్. తొలుత బ్యాటింగ్ చేసిన ఎంఐ.. ఓవర్లన్నీ ఆడి 205 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ తర్వాత చేజింగ్ స్టార్ట్ చేసిన డీసీ.. 10 ఓవర్లకు 2 వికెట్ల నష్టానికి 119 పరుగులతో పటిష్టంగా ఉంది. విజయానికి ఇంకో 60 బంతుల్లో 86 పరుగులు కావాలి. రిక్వైర్డ్ రన్‌రేట్ పెద్దగా లేకపోవడం, చేతిలో 8 వికెట్లు ఉండటం, కరుణ్ నాయర్ (40 బంతుల్లో 89) రెచ్చిపోయి ఆడుతుండటంతో ఢిల్లీ గెలుపు ఖాయం అని అంతా అనుకున్నారు. కానీ మూడు ఓవర్లలో ఆట మొత్తం మారిపోయింది. దీనికి క్రెడిట్ రోహిత్‌కు ఇవ్వాలి. తేమ కారణంగా 11వ ఓవర్‌లో కొత్త బంతిని తీసుకుంది ముంబై. దీంతో స్పిన్నర్లను రంగంలోకి దించాలని కెప్టెన్ హార్దిక్‌కు సూచించాడు హిట్‌మ్యాన్. రన్స్ లీక్ అయ్యే రిస్క్ ఉన్నా ఫర్వాలేదని అతడికి ధీమా ఇచ్చాడు.

**సంతోషం పట్టలేక..**

రోహిత్ మాటలు విన్న పాండ్యా శాంట్నర్, కర్ణ్ శర్మను బౌలింగ్‌కు దింపాడు. దీంతో అప్పటివరకు జెట్‌స్పీడ్‌లో దూసుకెళ్తున్న డీసీకి ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి. నాయర్‌తో పాటు అభిషేక్ పోరెల్, ట్రిస్టన్ స్టబ్స్, కేఎల్ రాహుల్, విప్రజ్ నిగమ్‌లు 36 బంతుల వ్యవధిలో ఔట్ అయ్యారు. తక్కువ గ్యాప్‌లో 5 వికెట్లు పడటంతో ఢిల్లీ కోలుకోలేకపోయింది. క్లోజ్ మ్యాచ్‌లో 12 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. రోహిత్ సలహా వర్కౌట్ అవడం, శాంట్నర్-కర్ణ్ శర్మ కలసి 5 వికెట్లు పడగొట్టడం, పోయిందనుకున్న మ్యాచ్‌లో నెగ్గడంతో పాండ్యా సంతోషం పట్టలేకపోయాడు. డగౌట్‌లో కూర్చున్న రోహిత్‌కు ఫ్లయింగ్ కిస్‌లు ఇచ్చాడు. దీంతో హిట్‌మ్యాన్ నవ్వుల్లో మునిగిపోయాడు. భలే ఆడారంటూ చప్పట్లతో అభినందించాడు. ఇది చూసిన నెటిజన్స్.. రోహిత్ స్కెచ్ వేస్తే ఇట్లుంటదని, ఒక్క మాటతో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడంటూ ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు.

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..













# ఇప్పట్లో పెళ్లి ప్రస్తావన లేదు

**తమన్నా**

మిల్కీ బ్యూటీ తమన్నా గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఈ అమ్మడు ఒకప్పుడు టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఇటీవల పెద్దగా అవకాశాలు దక్కించుకోలేకపోతున్న ఈ భామ ఐటమ్ సాంగ్స్ చేస్తూ అదరగొడుతుంది. అయితే తమన్నా కొద్ది రోజులుగా విజయ్ వర్మతో రిలేషన్‌లో ఉంది. కాని ఇటీవల అతనికి బ్రేకప్ చెప్పినట్టు- సమాచారం. విజయ్ వర్మతో డేటింగ్ వరకు ఓకే, పెళ్ళికి సిద్ధంగా లేనని చెప్పడంతో అతనితో తమన్నా బ్రేకప్ చేసుకుందని వార్తలు వినిపించాయి. అయితే తమన్నా ఇప్పుడు ఓదెల2 చిత్ర ప్రమోషన్స్‌తో బిజీగా ఉంది. ఇందులో శివశక్తి రోల్‌లో డిఫరెంట్ పాత్రలో కనిపించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పెళ్లిపై అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించారు. మీరు పెళ్లెప్పుడు చేసుకోబోతున్నారని ఇంటర్వ్యూలో అడగ్గా.. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదని చెప్పుకొచ్చింది. తమన్నా సమాధానం విని అందరు ఆశ్చర్యపోతున్నారు. ఇక తమన్నా కొంతకాలంగా బాలీవుడ్ నటు-డు విజయ్ వర్మతో ప్రేమలో మునిగి తేలింది.. వీరిద్దరికీ బ్రేకప్ అయ్యిందంటూ వార్తలు హల్చల్ చేశాయి. దీనిపై ఇద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. ఇటీవల వేర్వేరుగా ఈ ఇద్దరు ఫంక్షన్స్ కి , పార్టీలకి హాజరవుతున్నారు. దీంతో వారిద్దరు విడిపోయారని భావిస్తున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు సైతం ఇద్దరికీ బ్రేకప్ అయ్యిందనే వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. ఆఫర్లు లేకపోవడంతోనే చిన్న సినిమాల్లో నటిస్తున్నారా? అనే ప్రశ్నకు తమన్నా బదులిస్తూ.. తన దృష్టిలో చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదని.. కంటెంట్ బాగుంటే పెద్ద సినిమా అవుతుందని.. లేకుంటే చిన్న సినిమా అవుతుందని చెప్పుకొచ్చింది. ఇప్పటివరకూ సినిమాల్లో అమ్మాయిల్ని డాక్టర్‌గా, పోలీస్ ఆఫీసర్‌గా డిఫరెంట్ రోల్స్‌లో చూశాం. కానీ శివశక్తి రోల్‌ను ఎవరూ స్క్రీన్‌పై చూపించలేదు. ఇది ఓ పెద్ద బాధ్యత. శివశక్తులు ఎలా ఉంటారో ప్రజలకు తెలియాలి. ఈ సినిమా చూస్తే అసలు ఎందుకు తీశామో వారికి అర్థమవుతుందని చెప్పారు.

# హిట్ యూనివర్స్‌లో హిట్ ద థర్డ్ కేస్

హిట్' యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న సరికొత్త చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్' నాని కథానాయకుడిగా శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈసినిమా సిద్ధమవుతోంది. శ్రీనిధి శెట్టి కథానాయిక. ఇందులో నాని పవర్ ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో అర్జున్ సర్కార్‌గా కనిపించనున్నారు. తాజాగా ఈసినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. వరుస హత్యలు.. అర్జున్ వాటిని ఎలా ఛేదించాడు అనే కోణంలో ఈ సినిమా సాగనుందనేది ప్రచార చిత్రాలు చూస్తే తెలుస్తోంది. అర్జున్ సర్కార్‌గా నాని సంభాషణలు, నటన విశేషంగా ఆకట్టుకునేలా ఉన్నాయి. 'హిట్ 1, 2'తో పోలిస్తే ఇది చాలా వైల్డ్‌గా ఉన్నట్లు అర్థమవుతోంది. వేసవి కానుకగా మే 1న ఇది విడుదల కానుంది. ఇక ట్రైలర్ విడుదల కార్యక్రమం వైజాగ్‌లో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో నాని పాల్గొని అభిమానులతో ముచ్చటించారు. సినిమా విశేషాలు పంచుకున్నారు. ఈ సినిమా తప్పకుండా విజయాన్ని అందుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. వైజాగ్‌తో తనకు ఉన్న అనుబంధం గురించి మాట్లాడారు. ఈ ప్రాంతవాసులు తనని అల్లుడిగా చూస్తుంటారని చెప్పారు. అభిమానులను ఉద్దేశించి మీ ఎనర్జీ చూస్తుంటే సాయంత్రం వరకూ ఇక్కడే ఉండాలని ఉంది. 15 ఏళ్ల క్రితం నా పెళ్లికి ముందు ఒక అమ్మాయిని కలవడానికి వైజాగ్ వచ్చేవాడిని. ఆ తర్వాత ఆమెనే పెళ్లి చేసుకున్నా. గత 15 ఏళ్ల నుంచి మిమ్మల్ని కలవడానికి వస్తున్నా. అప్పుడు వచ్చిందీ ప్రేమ కోసమే.. ఇప్పుడు వస్తోందీ ప్రేమ కోసమే. ఇక్కడి వారితో అంతటి అనుబంధం ఏర్పడింది. వేరే ఊర్లకు వెళ్తే అక్కడివారు నన్ను ఒక అన్న లేదా తమ్ముడిలా చూస్తారు. కానీ వైజాగ్ వాళ్లు మాత్రం నన్ను అల్లుడిలాగే చూస్తారు. అది నాకెంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది. మేమంతా ఒక అద్భుతమైన చిత్రాన్ని అందించనున్నాం. ఇది కొత్త జానర్ సినిమా. మే 1వ తేదీన మనం గెలుస్తాం. నాని యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వారంతా ఒకటో తేదీ థియేటర్లకు వచ్చేయండి. నాని లవ్ స్టోరీలు, ఫీల్‌గుడ్, ఫన్ చిత్రాలు చేయాలనుకునేవారు ఆరోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. నాని అన్నిరకాల చిత్రాల్లో యాక్ట్ చేయాలనుకునే వారు మా చిత్రాన్ని ఎంజాయ్ చేయండని సరదాగా అన్నారు.



# కృత్రిమ మేధతో చక్రి స్వర రూపకల్పన

## మాస్ జాతరలో స్పెషల్ అట్రాక్షన్

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పుడు ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా 'తు మేరా లవర్'ను విడుదల చేశారు. ప్రోమోతోనే అందరి దృష్టిని ఆకర్షించిన 'తు మేరా లవర్' గీతం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా చూశారు. తాజాగా విడుదలైన ఈ పాట, ఒక్కసారి వినగానే శ్రోతలకు అభిమాన గీతం మారిపోతోంది. ధమాకా జోడి రవితేజ-శ్రీలీల అందరి అంచనాలను అందుకునేలా, అద్భుతమైన కెమిస్ట్రీతో మరోసారి మ్యాజిక్ చేశారు. ప్రేక్షకులకు వెండితెరపై పూర్తి స్థాయి ట్రీట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఈ పాటతో చెప్పకనే చెప్పేశారు. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో 'తు మేరా లవర్' గీతాన్ని అద్భుతంగా స్వరపరిచారు. భాస్కరభట్ల సాహిత్యం మాస్ మెచ్చేలా ఉంది. రవితేజ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇడియట్'లోని ఐకానిక్ చార్ట్‌బస్టర్ 'చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే' పాటకు ట్రిబ్యూట్ గా మలిచిన 'తు మేరా లవర్' అభిమానులకు విందు భోజనంలా ఉంది. దీనిని ఒక ప్రత్యేకమైన సంగీత నివాళిగా మార్చడానికి నిర్మాతలు కృత్రిమ మేధస్సుని ఉపయోగించి దివంగత సంగీత దర్శకుడు చక్రి స్వరాన్ని తిరిగి సృష్టించారు. రవితేజ శైలి ప్రత్యేక డ్యాన్స్ స్టెప్పులు, శ్రీలీల అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ఈ గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టు-కుంటోంది. దర్శకుడు భాను బోగవరపు రవితేజ అభిమానులతో పాటు-, మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా 'మాస్ జాతర'ను మలుస్తున్నారు. ప్రముఖ ఛాయగ్రాహకుడు విధు అయ్యన్న తన ప్రభావవంతమైన విజువల్స్ తో పాటకి తగ్గట్టుగా మాస్ వైబ్‌ను అద్భుతంగా చూపించారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు.




# ఆలోచించి సినిమా చేస్తా

## నెటిజన్ కామెంట్స్‌కు నిధి ఘాటు రిప్లై

సోషల్ మీడియాలో సెలబ్రిటీల మీద అప్పుడప్పుడూ నెటిజన్లు ఇబ్బంది పెట్టే కామెంట్లు చేయడం మనం చూస్తూనే ఉంటాం. కొన్ని సార్లు సెలబ్రిటీలు వాటిని సీరియస్‌గా తీసుకుని స్పందిస్తూ ఉంటారు. ఇప్పుడు నిధి అగర్వాల్ కూడా ఇలాగే సీరియస్ గా స్పందించింది. తాజాగా ఓ పేజీలో నిధి గురించి పోస్టు చేశారు. దానిపై ఓ నెటిజన్ స్పందిస్తూ.. నిధి అగర్వాల్ ను శ్రీలీలతో పోలుస్తూ కామెంట్ చేశాడు. శ్రీలీల ఇప్పటికే చాలా సినిమాలు చేస్తోందని.. నిధి మాత్రం ఇస్మార్ట్ శంకర్ తర్వాత ఏం చేసింది అంటూ ప్రశ్నించాడు. ఈ కామెంట్ కు స్వయంగా నిధి అగర్వాల్ సీరియస్ గా స్పందిస్తూ అతనికి లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చి పడేసింది.ఆమె స్పందిస్తూ.. 'ఇస్మార్ట్ శంకర్ తర్వాత హీరో సినిమా చేశాను. తమిళంలో మూడు సినిమాలు చేశాను. హరిహర వీరమల్లు సినిమాకు సైన్ చేశాను. ఆతృతతో సినిమాలు చేయాలని లేదు. ఆలోచించి మంచి సినిమాలు చేయాలని చూస్తున్నాను. నా గురించి నువ్వు అంత -టె-న్షన్ పడకు. నీ పని చూసుకో బ్రదర్' అంటూ కౌంటర్ ఇచ్చింది నిధి అగర్వాల్. ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిధి అగర్వాల్ నుంచి త్వరలోనే హరిహర వీరమల్లు సినిమా రాబోతోంది. దానిపై మంచి అంచనాలు ఉన్నాయి. ఇది పాన్ ఇండియా సినిమాగా వస్తోంది. ఇది హిట్ అయితే నిధికి మళ్లీ అవకాశాలు పెరిగే ఛాన్స్ ఉంటుంది.


Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**